J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 13 30.08.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

● బై..బై.. జగన్

## రాజ్యసభకి రాజీనామా చేసిన మస్తానయ్య, రమణ



వీళ్ళ బాటలోనే మరికొందరు

### టీడీపీలోకి మోపిదేవి, సందిగ్ధంలో బీద



ఆంధ్రాలో మొన్నటి సాధారణ ఎన్నికల్లో దారుణమైన పరాజయాన్ని చవిచూసిన వైసీపీ తిరిగి కోలుకుంటుందా లేదా..? అన్న విషయం పక్కనపెడితే, పార్టీలో ముఖ్యమైన నేతలు ఒక్కొక్కరుగా 'బై.. బై... జగన్' అంటూ వెళ్లిపోతుండడం రాష్ట్ర రాజకీయాలలో సంచలనంగా మారుతోంది.

3లో

రాష్ట్రంలో పట్టాలెక్కని పాలన...

# అష్టదిగ్బంధనంలో బాబు!



ఒకడుగు ముందుకేస్తే మూడడుగులు వెనుకకి లాగుతున్న..

బీజేపీ - జనసేన - బాలకృష్ణ - లోకేష్

ఈనాడు - ఏబీఎన్ - టీవీ5 - పార్టీ శ్రేణులు

## పాత బాబుకి కొత్త సమస్యలు

ఓ వైపు అప్పుల ఊబిలో రాష్ట్రం. మరోవైపు బాబు కురిపించిన వరాలు. వీటితో పాటు గత అయిదు సంవత్సరాలుగా రాష్ట్రంలో జరిగిన అవినీతి కుంభకోణాల గుట్టు రట్టు చేయడం, అభివృద్ధి పరంగా అఘాతంలోకి వెళ్లిపోయిన రాష్ట్రాన్ని ప్రగతి వైపు నడిపించడం, గాడి తప్పిన అధికార వ్యవస్థని దారిలో పెట్టడం, పదేళ్లుగా దిక్కులేని రాష్ట్రంగా మిగిలిపోయిన ఆంధ్రాకి శాశ్వత రాజధానిని ఏర్పాటు చేయడం, వైసీపీ పాలనలో అష్ట కష్టాలు పడ్డ పార్టీ శ్రేణులకి న్యాయం చేయడం, ఖాళీగా పడివున్న అన్ని విభాగాల నామినేటెడ్ పెదవులని భర్తీ చేయడం, మొన్నటి ఎన్నికలలో తనతో జతకట్టిన బీజేపీ, జనసేనల విషయంలో సమన్యాయం పాటించడం, జగన్‌కి వ్యతిరేకంగా తనతో పాటు పోరాటంచేసి తనకి అండగా నిలిచిన మీడియాపెద్దల ఋణం తీర్చుకోవడం... ఇవన్నీ ఇప్పుడు ఆంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ముందున్న అతిపెద్ద సవాళ్ళు. వీటి మధ్య పాత బాబు అయితే ఎలా వుండేదో కానీ, చెప్పిన మాట నిలబెట్టుకోవాలని తపనపడుతున్న కొత్త బాబు మాత్రం అష్టదిగ్బంధనంలో ఇరుక్కుని సతమవుతున్నారు.

### బాబు నోట కొత్త మాట!

మీరు మళ్లీ పాత చంద్రబాబును చూస్తారు. ఏ విషయం లోనూ రాజీపడేది లేదు. అందరూ ఒళ్ళు దగ్గర పెట్టుకుని

5లో



గునుపాటి ఆదిశేషారెడ్డి గారు

జననం: 01.07.1930 నిర్యాణం: 03.09.2016

## 8వ వర్థంతి

ప్రముఖ న్యాయవాది, మా ఇంటి దైవం

### గునుపాటి ఆదిశేషారెడ్డి గారు

పరమపదించి తేది.03.09.2024 నాటికి ఎనిమిదేళ్ళు గడవనున్న సందర్భంగా

ఆ పుణ్యమూర్తిని స్మరిస్తూ...

వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారుడు

గునుపాటి మురళీకృష్ణారెడ్డి

మరియు

కుటుంబసభ్యులు

# గొల్లవారిపాలెంలో కొత్త అంగన్‌వాడీ భవనం

○ శ్రీసిటీ-ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ పరిశ్రమ వితరణ



శ్రీసిటీ పరిధిలోని గొల్లవారిపాలెం గ్రామంలో కొత్త అంగన్‌వాడీ భవనం ప్రారంభమైంది. శ్రీసిటీ ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ హాజీమే కజోకా ఈ భవనాన్ని ఇటీవల ప్రారంభించారు. శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో ఆ పరిశ్రమ తన కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమం ద్వారా రూ.35 లక్షల ఖర్చుతో నిర్మించారు. భవనంతో పాటు విద్యార్థులకు మరుగు దొడ్లు, ప్రహరీ గోడ, ఫర్నిచర్, టీవి, ఆట వస్తువులను ఏర్పాటుచేశారు. ఇందుకు అవసరమైన భూమిని శ్రీసిటీ విరాళంగా అందచేసింది. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ అసిస్టెంట్ మేనేజింగ్ డైరెక్టర్ తకావో ఇకరాషి, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు సంజయ్ ఆనంద్, మల్లేశ్వరన్, సాయి కృష్ణ, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్‌కుమార్, సెక్యూరిటీ ప్రతినిధి వై.రమేష్, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్రకుమార్, గ్రామ సర్పంచ్ పార్వతి సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో... ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ పరిశ్రమ వారిని అభినందిస్తూ, ఈ చొరవ ఇతర పరిశ్రమలకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందన్నారు. ఇలాంటి మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టేందుకు పరిశ్రమలు ముందుకు రావాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

గతంలోనూ ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ సంస్థ సత్యవేడులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు రూ. 26 లక్షల విలువైన అంబులెన్స్‌ను ఏర్పాటుచేసింది. అదేవిధంగా తడ జడ్పీ హైస్కూల్‌లో రూ. 8.5 లక్షలతో టాయిలెట్ బ్లాకుల నిర్మాణం చేపట్టి తన వితరణను చాటుకుంది కూడా.

# శ్రీసిటీలో అత్యాధునిక 'ఫిట్‌నెస్ సెంటర్'



శ్రీసిటీలో సామాజిక మౌళిక సదుపాయాల కల్పనలో భాగంగా స్థానిక క్రీక్ సైడ్ రెసిడెన్షియల్ సమీపంలోని షాపింగ్ ఆర్కేడ్ రెండవ అంతస్తులో 'ఫిట్‌నెస్ జోన్' పేరిట నూతన ఎయిర్ కండిషన్డ్ జిమ్‌ను శ్రీసిటీ ఈనెల 25న ప్రారంభించింది. స్థానికుల ఫిట్‌నెస్ అవసరాలను తీర్చడానికి సుమారు రూ.30 లక్షల పెట్టుబడితో ఆధునిక సౌకర్యాలతో దీనిని స్థాపించడం విశేషం. రాక్‌వర్త్ పరిశ్రమకు చెందిన శ్రీరాం, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్(కస్టమర్ రిలేషన్స్) రమేష్ కుమార్ ఈ జిమ్‌ను ప్రారంభించారు. జిమ్ ఉపయోగించడం వల్ల ఆరోగ్యం ఎంతో బావుంటుందని చెప్పారు. జిమ్ ఏర్పాటు పట్ల శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో సంతోషం వ్యక్తం చేశారు. స్థానిక ఉన్నత విద్యాసంస్థల విద్యార్థులు, ఉద్యోగులు, వారి కుటుంబాలు ఈ ఫిట్‌నెస్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# బీజేపీని బలోపేతం చేయడమే లక్ష్యం

**- మైనార్టీ మోర్చా రాష్ట్ర నేత బాజీ**



బీజేపీని గ్రామస్థాయి నుంచి పటిష్టం చేయడమే లక్ష్యంగా కార్యక్రమాలు చేపడుతున్నామని, కార్యకర్తలు-నాయకులు సమిష్టిగా వాటిని జయప్రదం చేయాలని బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బాజీ కోరారు. ఈనెల 25న ఆయన నెల్లూరులోని బీజేపీ కార్యాలయంలో జరిగిన సంస్థాగత సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, సెప్టెంబరు 1 నుంచి 16వతేదీ వరకు మండలస్థాయిలో కూడా సమావేశాలు పెట్టి, ప్రజలకు దేశవ్యాప్తంగా బీజేపీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలన్నారు. దేశాభివృద్ధిని కాంక్షించేవారితో ఆత్మీయంగా కలసి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలన్నారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రాజేశ్వరి, మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి బాషా తదితరులు పాల్గొన్నారు.

# ఎంసీఏలో సత్తా చాటిన..'కృష్ణచైతన్య'



నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్శిటీ వారు తాజాగా విడుదల చేసిన ఎంసీఏ మూడవ సెమిస్టర్ ఫలితాల్లో స్థానిక కృష్ణచైతన్య కళాశాల విద్యార్థులు తమ సత్తా చాటారు. ఆర్ నలుబోలు సుమ 635 మార్కులతో యూనివర్శిటీ స్థాయిలో ప్రథమస్థానంలో రాణించడం పట్ల కళాశాల డైరెక్టర్లు ఆర్వి కృష్ణారెడ్డి, పర్వతరెడ్డి రాణా ప్రమోద్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. జి.తేజస్విని 634 మార్కులతో ద్వితీయస్థానం, 628 మార్కులతో కె. చైతన్య తృతీయస్థానం సాధించారు. కళాశాల డీన్ మల్లికార్జునయ్య, అడ్మిన్ డీన్ జ్యోతి, ప్రిన్సిపాల్ ప్రసాద్ తదితరులు పాల్గొని ఆ విద్యార్థులను అభినందించారు.

## కందుకూరుకు
# కొత్త సబ్ కలెక్టర్



**ఐఏఎస్ అధికారిణి శ్రీపూజ నియామకం**

కందుకూరు రెవెన్యూ డివిజన్‌కు కొత్త సబ్ కలెక్టర్‌గా 2022 బ్యాచ్‌కి చెందిన తిరుమాని శ్రీపూజ నియమితులయ్యారు. ఈ స్థానంలో ఉన్న జి.విద్యాధరిని కర్నూలు కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీచేసి, అక్కడినుంచి ఇటీవలనే చిత్తూరు జాయింట్ కలెక్టర్‌గా నియమించారు. శ్రీపూజను కందుకూరులో నియమిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులిచ్చింది. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలానికి చెందిన ఆమె, సూరత్‌లోని ఎన్ఐటీలో బీటెక్ చదివి సివిల్స్ పరీక్షలు రాసి రెండవ ప్రయత్నంలోనే జాతీయ స్థాయిలో 62వ ర్యాంకు సాధించి, ఆంధ్రా క్యాడర్‌కి ఎంపికయ్యారు. ప్రొబేషన్ పూర్తయ్యాక కందుకూరు సబ్ కలెక్టర్‌గా నియమితులు కావడం విశేషం. ఆమె తండ్రి పంచాయతిరాజ్ కమిషనర్ కార్యాలయంలో ఉద్యోగిగా ఉన్నారు. కొత్త సబ్ కలెక్టర్‌కు 'లాయర్' శుభాకాంక్షలు.

## కొండాయపాళెం స్కూల్లో
# పుస్తకాల పంపిణీ

**పాల్గొన్న జీఎస్టీ రాష్ట్ర కమిషనర్**



నెల్లూరులోని కొండాయపాళెం నగర పాలక ప్రాథమిక పాఠశాలలో ఈనెల 24న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. జీఎస్టీ (ఆడిట్) రాష్ట్ర కమిషనర్ ఆనంద్‌కుమార్ పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. విద్యార్థులంతా బాగా చదువుకుని సమాజంలో ఉన్నత స్థాయిలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ డా. ఉషాకిరణ్‌రాయ్, నారాయణ దంతవైద్యశాల హెచ్‌ఓడీ కన్నన్, ఏపీయుడబ్ల్యుజె నాయకుడు జయప్రకాష్, ఏఆర్‌కె ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

# పర్వతరెడ్డికి వైకాపాలో మరో బాధ్యత

● **ఉపాధ్యాయ విభాగం రాష్ట్ర అధ్యక్షునిగా నియామకం**



తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ శాసన మండలి సభ్యునిగా, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షునిగా, రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మెన్‌గా బాధ్యతలు నిర్వరిస్తున్న పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరో బాధ్యతను కూడా అప్పగించారు. వైకాపా ఉపాధ్యాయ విభాగం రాష్ట్ర అధ్యక్షునిగా ఆయన్ను నియమిస్తూ ఇటీవల ఉత్తర్వులిచ్చారు. తనపై నమ్మకంతో రాష్ట్ర ఉపాధ్యాయ విభాగం అధ్యక్షునిగా తనను నియమించిన వైఎస్ జగన్‌కు పర్వతరెడ్డి ఈ సందర్భంగా కృతజ్ఞతలు చెప్తూ, రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యలు, వారి హక్కుల సాధనకు కృషిచేస్తానన్నారు. కొత్త బాధ్యతలు స్వీకరించిన పర్వతరెడ్డికి పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు శుభాకాంక్షలు చెప్పారు.

# పెన్నా జలాలతో.. కలశాల ఊరేగింపు

○ **భారీసంఖ్యలో పాల్గొన్న మహిళా భక్తులు**



నెల్లూరు వైకుంఠపురంలో ఉన్న అవధూత కాశినాయన ఆశ్రమం నిర్వాహకులు ఈనెల 25న ఆశ్రమంలో కొలువైవున్న కనకదుర్గాదేవి సమేత శ్రీ మల్లికార్జునస్వామికి పెన్నాజలాలతో అభిషేక సేవలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 'జై కనకదుర్గమ్మా!.. జైజై దుర్గమ్మతల్లీ' అంటూ పెద్దసంఖ్యలో మహిళాభక్తులు పాల్గొని, నగరంలోని శ్రీ రంగనాథస్వామి దేవస్థానం వద్దకు చేరుకున్నారు. అక్కడ పెన్నమ్మతల్లికి హారతులు పట్టారు. అభిషేక జలాలను కలశాల్లో నింపుకుని అక్కడి నుంచి కనకదుర్గమ్మ ఆలయం వద్దకు ఊరేగింపుగా వచ్చి స్వామివారికి-అమ్మవారికి అభిషేకాలు చేశారు. ప్రజలంతా శాంతిసౌఖ్యాలతో జీవించేలా అనుగ్రహించాలంటూ దుర్గమ్మతల్లిని ప్రార్థించారు. లోక కల్యాణం కోసం ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించామని అర్చకులు సంతోష్ స్వామి తెలిపారు. ఆశ్రమం నిర్వాహకులు ధన్వి శ్రీనివాస్, మహంకాళి వెంకటేష్, మహేష్, కుడుముల వెంకటేష్, సిద్ధూ, లక్ష్మణ్, చంద్ర తదితరులు పర్యవేక్షించారు.

# శ్రీ లక్ష్మీనృసింహునికి..కన్నులపండువగా కల్యాణోత్సవం



పెంచలకోనలో కొలువైవున్న ఆదిలక్ష్మి చెంచులక్ష్మీదేవి సమేత శ్రీ లక్ష్మీనృసింహ స్వామివారికి ఆలయ అర్చకులు ఈనెల 24వ తేది ఉదయం కన్నులపండువగా కల్యాణోత్సం నిర్వహించారు. తొలుత వేకువన 4 గంటలకి స్వామివారికి అభిషేక సేవ చేసి, వేదపండితుల వేదమంత్రోచ్చాటనలు, మంగళవాద్యాల మధ్య సంప్రదాయబద్ధంగా నిర్వహించిన కల్యాణోత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం సాయంత్రం స్వామివారికి తిరుచ్చి, పల్లకిసేవ, సహస్రదీపాలంకరణ సేవలు నేత్రపర్వంగా చేపట్టారు. ఆలయ ఉప కమిషనర్ కేవీ సాగర్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలను ఆలయ అధికారులు, సిబ్బంది పర్యవేక్షించారు.

# పల్లిపాడులో జాతీయ అంతరిక్ష దినోత్సవం



ఇందుకూరుపేట మండలం పల్లిపాడులోని ప్రభుత్వ విద్యా సంస్థ 'డైట్'లో ఇటీవల ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఛాత్రోపాధ్యాయుల సమక్షంలో ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించారు. డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, అంతరిక్షయానంలో భారతదేశం అనే అంశంపై శిక్షణార్థులకు వ్యాసరచన, అంతరిక్ష రంగంలో ఇస్రో పాత్ర అనే అంశంపై వక్తృత్వ పోటీ, అంతరిక్షానికి సంబంధించిన ఏదైనా ఒక సృజనాత్మక ఆలోచన లేదా ఊహపై డ్రాయింగ్, ప్రపంచ మరియు భారతదేశ అంతరిక్ష చరిత్రపై క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డైట్ అధ్యాపకులు డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డాక్టర్ ఆర్.బాలాజీరావు, అధ్యాపకులు కె.విజయచంద్ర, ఎస్‌బి దాస్, డి.నరసింగరావు, ఎన్.శివ, సి.సోమేశ్వర్, కె.షఫీఅహ్మద్, ఆఫీస్ సూపరింటెండెంట్ ఎం.మేరీప్రసూన, తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీకి.. పీజీ సీట్లు కేటాయించండి

## - నేషనల్ మెడికల్ కమిషన్ ఛైర్మెన్‌కు.. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి వినతి



నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ విభాగాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్‌కు సంబంధించి కొత్తగా సీట్లు కేటాయించాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నేషనల్ మెడికల్ కమిషన్ ఛైర్మన్ బి.ఎన్ గంగాధర్‌కు విన్నవించారు. ఢిల్లీలోని కమిషన్ కార్యాలయంలో ఆయన ఈ నెల 29న ఛైర్మెన్‌ను కలిసి, ఆమేరకు ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ నెల్లూరుశాఖ తరఫున వినతి పత్రాన్ని అందజేశారు. 2024–25 సంవత్సరా నికి నెల్లూరు మెడికల్ కాలేజీలో ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీకి సంబంధించి పీజీ సీట్లు కేటాయించాలని, ఆ విభాగంలో కొత్తగా సీట్లు కేటాయించడం ద్వారా యువ డాక్టర్లకు సీట్లు అందుబాటులోకి వచ్చి, తద్వారా పేదలకు మంచి వైద్యం అందుతుందన్నారు. జిల్లా వైద్యశాల అభివృద్ధికి కూడా అదెంతో ఉపయోగపడుతుందని వివరించారు. వేమిరెడ్డి వినతికి సానుకూలంగా స్పందించిన ఛైర్మెన్ గంగాధర్, సీట్ల కేటాయింపుపై తప్పకుండా కృషిచేస్తామని చెప్పారు.

# శ్రీశైల మల్లన్న సేవలో..ప్రశాంతిరెడ్డి

## • స్వర్ణ రథోత్సవంలో పాల్గొన్న కోవూరు ఎమ్మెల్యే



ఎంతో విశిష్టమైన ఆరుద్ర నక్షత్రం.. గురువారం శుభదినాన్ని పురస్కరించుకుని ఈనెల 29న కర్నూలు జిల్లాలోని ప్రఖ్యాత శైవక్షేత్రం.. శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబాదేవి సమేత శ్రీమల్లికార్జునస్వామివార్లకు ప్రత్యేకపూజలు జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన స్వర్ణ రథోత్సవం అత్యంత వైభవంగా.. నయనానందకరంగా సాగింది. ఆలయ ప్రాంగణమంతా 'ఓం నమశ్శివాయ' నామోచ్ఛారణలతో మార్మోగింది. స్వామివార్ల బంగారు రథ సేవ భక్తులను తన్మయులను చేసింది. ఎంతో పుణ్యప్రదమైన ఈ సేవలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకుని తరించారు. శ్రీశైల మల్లన్న స్వర్ణ రథోత్సవ కార్యక్రమంలో తాను పాల్గొనడం తన అదృష్టమంటూ ఆమె ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు. ఈ వేడుకలో ప్రశాంతిరెడ్డి తనయుడు అర్జున్ రెడ్డి, కుటుంబసభ్యులు హనీష్, ముంగమూరు చైతన్య తదితరులు పాల్గొని స్వామి–అమ్మవారిని దర్శించుకున్నారు. తొలుత వారిని ఆలయ అధికారులు పెద్దిరాజు, అర్చకులు సాదరంగా స్వాగతించారు. నెల్లూరుజిల్లా టీడీపీ నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, బెజవాడ వంశీరెడ్డి తదితరులు వారితో పాటు పాల్గొన్నారు.

# మస్తానయ్య, రమణ

(మొదటిపేజీ తరువాయి)

అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో వైసీపీ ఘోర ఓటమి తర్వాత ఆ పార్టీ నేతలు తమ దారి తాము చూసుకుంటున్నారు. ఇప్పటికే ఆళ్ల నాని లాంటి మాజీ మంత్రితో పాటు మరికొంతమంది రాజీనామా బాట పట్టినా వాళ్ళందరూ ఎలాంటి హోదాలు లేనివాళ్ళే.

అయితే, పార్టీ మారదలచినవారు తమ పదవులకి, పార్టీకి రాజీనామా చేసి రావాలన్న కూటమి నేతల నిబంధనని కూడా ఎవరూ లెక్కపెట్టడంలేదు. తమ పదవులను తృణప్రాయంగా వదిలేసి వైసీపీని వీడుతున్నారు.

తాజాగా రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, మోపిదేవి వెంకటరమణలు తమ రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఇందుకోసం బుధవారం రాత్రే ఢిల్లీకి చేరుకున్న ఇద్దరు నేతలు గురువారం మధ్యాహ్నం 12.30గంటలకు రాజ్యసభ ఛైర్మెన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్‌కు తమ రాజీనామా పత్రాలు సమర్పించారు.

తాను టీడీపీలో చేరుతున్నట్లుగా మోపిదేవి ప్రకటించారు. బీద నిర్ణయంపై ఇంకా స్పష్టత రాలేదు. అయితే, వీరిద్దరి దారిలో మరో ఆరుగురు వైసీపీ ఎంపీలు కూడా ఉన్నట్లు సమాచారం. కొందరు టీడీపీ, మరికొందరు బీజేపీ వైపు చూస్తున్నట్టు రాజకీయ వర్గాల భోగట్టా.

### పుట్టింటికి మస్తానయ్య?

బీద మస్తాన్‌రావు... టీడీపీకి పాత కాపే. ఆయన రాజకీయ ఆరంగేట్రం టీడీపీతోనే మొదలయ్యింది. 2009లో కావలి నుంచి ఎమ్మెల్యేగా కూడా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2014లో పోటీచేసి ఓడిపోయినా, బీదకి రాజధాని అభివృద్ధి కమిటీలో చంద్రబాబు స్థానం కల్పించారు. మళ్ళీ 2019లో కావలి టిక్కెట్టు ఆయనకే ఇచ్చినా వైసీపీ గాలిలో బీద ఓడిపోయారు.

జగన్ పాలనలో చక్రం తిప్పిన విజయసాయి రెడ్డితో మస్తాన్‌రావుకి మంచి సాన్నిహిత్యంతో పాటు వ్యక్తిగత స్నేహం కూడా ఉంది. ఆ బంధంతో మస్తానయ్య వైసీపీలో చేరి 2022లో రాజ్యసభ సభ్యులయ్యారు. 2028 దాకా ఆయన సభ్యత్వం ఉంది. కానీ, అధికార మార్పిడి తర్వాత తన సొంత పార్టీకే వెళ్తే బాగుంటుందని ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. అయితే, ఇంకా ఏ పార్టీలో చేరుతారు అన్న దానిపై స్పష్టత లేదు.

రాజీనామా చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తాను వ్యక్తిగత కారణాల వల్ల పార్టీకి, పదవికి రాజీనామా చేసినట్లు చెప్పుకొచ్చారు. భవిష్యత్ కార్యాచరణపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని అన్నారు. ఏ పార్టీలో చేరాలన్నదానిపై తన అభిమానులు, కార్యకర్తలతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని వివరించారు. ఇప్పటివరకు సహకరించిన వైసీపీ అధినేత జగన్‌కు, పార్టీ కార్యకర్తలకు ఈ సందర్భంగా బీద మస్తాన్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. మస్తాన్‌రావు సోదరుడు రవిచంద్ర తెలుగుదేశం పార్టీలోనే చురుకుగా వ్యవహరిస్తూ కొనసాగుతున్న విషయం తెలిసిందే.

### మోపిదేవికి పార్టీలో మంచి ప్రాధాన్యత ఇచ్చిన జగన్!

మోపిదేవి వెంకటరమణకి వైఎస్సార్సీపీలో మంచి ప్రాధాన్యతే ఉండేది. ప్రస్తుతం రాజ్యసభ సభ్యత్వంతో పాటు బాపట్ల జిల్లా వైసీపీ అధ్యక్షుడిగానూ మోపిదేవి ఉన్నారు. 2014, 2019 ఎన్నికల్లో రేపల్లె అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీచేసి ఓడిపోయినప్పటికీ, మోపిదేవికి జగన్ 2019 ఎన్నికల తర్వాత ఎమ్మెల్సీ ఇచ్చి మరీ కేబినెట్‌లోకి తీసుకున్నారు. అయితే, కౌన్సిల్‌ను రద్దు చేయాలన్న ఆలోచనతో మోపిదేవితో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయించి ఆయన్ను రాజ్యసభకు పంపించారు జగన్. అయితే, మోపిదేవి వెంకటరమణ గత కొంతకాలంగా జగన్‌పై అసంతృప్తిగా ఉన్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేపల్లె నుంచి ఆయన టికెట్ ఆశించారు. తనకు లేదంటే తన కుమారుడికి జగన్ అసెంబ్లీ టికెట్ ఇస్తాడని భావించారు. కానీ, సామాజిక సమీకరణ పేరుతో మోపిదేవి ఫ్యామిలీకి జగన్ టికెట్ నిరాకరించారు. మోపిదేవికి బదులు గణేశ్‌ను రేపల్లె నుంచి బరిలో దించాడు. అప్పట్నుంచి అసంతృప్తిలో ఉన్న మోపిదేవి పార్టీకి దూరంగా ఉంటున్నారు.

### దేశం గూటికి మోపిదేవి!

రాజీనామా అనంతరం మోపిదేవి కూడా మీడియాతో మాట్లాడారు. గెలుపైనా, ఓటమైనా స్థానిక రాజకీయాల్లో ఉండడమే తనకు ఇష్టమన్నారు. రాజ్యసభకు రావడం తనకు ఇష్టం లేదన్నారు. త్వరలో తెలుగుదేశం పార్టీలో చేరబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. టీడీపీలో తనకు ఎలాంటి బాధ్యతలు అప్పగిస్తారన్నది త్వరలోనే తెలుస్తుందని చెప్పారు. తాను పదవుల కోసం పార్టీ మారలేదని ఈ సందర్భంగా మోపిదేవి స్పష్టం చేశారు.

తమకున్న ఢిల్లీ స్థాయి పదవులని త్యజించి వచ్చిన వీళ్లిద్దరికీ మళ్ళీ ఎలాంటి పదవులు వస్తాయన్నది వేచి చూడాల్సిందే. రాజ్యసభకు రావడం తనకి ఇష్టం లేదని మోపిదేవి స్పష్టం చేయడంతో, బీదని మాత్రమే మళ్ళీ రాజ్యసభకి పంపించి, మోపిదేవిని శాసనమండలికి పంపిస్తారన్న వార్తలు కూడా వినపడుతున్నాయి.

ఇద్దరు ప్రధాన నేతలు వైసీపీని వీడడం, వీరిద్దరి బాటలో ఇంకా చాలామంది జారుకోవడానికి సిద్ధంగా ఉన్నారన్న వార్తలు రావడంతో వైసీపీ శ్రేణుల్లో ఆందోళన కనిపిస్తోంది.

# ఎట్టకేలకు కండలేరు ఎడమకాలువకు.. జల కళ!

## • నీరు విడుదల చేసిన ఎమ్మెల్యే సోమిరెడ్డి • రైతుల్లో ఆనందం





ఎట్టకేలకు రైతుల కోరిక నెరవేరింది. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పట్టుబట్టి, తుప్పుపట్టాయంటూ ఐదేళ్లుగా మూలనపెట్టిన మోటార్ల ద్వారానే కండలేరు కాలువలో సాగునీటిని పరుగులెత్తించడంతో రైతుల్లో ఆనందం వెల్లువెత్తింది. ఇంజనీరింగ్ అధికారులతో కలసి ఆయన ఈనెల 28న కండలేరు లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్లకు స్విచ్ ఆన్‌చేసి, నీటిని విడుదల చేశారు. అనంతరం సోమిరెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ, ఎడమ కాలువకు నీరందండతో వాటి వల్ల పొదలకూరు చుట్టుపక్కల నున్న ఆరు మండలాల పరిధిలో సుమారు 20 వేల ఎకరాలకు పైగానే నీరందుతాయన్నారు. ఒక్కో మోటారు 130 క్యూసెక్కుల వంతున 260 క్యూసెక్కుల నీటిని పంప్ చేస్తాయని, పొదలకూరు మండలంలో 16824 ఎకరాలు, చేజర్ల మండలంలో 1426 ఎకరాలు, సైదాపురం మండలంలో 1063 ఎకరాలు, మనుబోలు మండలంలో 249 ఎకరాలు, వెంకటాచలం మండలంలో 536, నెల్లూరు రూరల్ మండ లంలో 606 ఎకరాలు వంతున ఈ కాలువ పరిధిలో ఉన్నాయని తెలిపారు. వైకాపా ప్రభుత్వంలో ఈ ఎత్తిపోతల ప్రాజెక్టును మూలనపెట్టేశారని, కనీసం కరెంటు చార్జీలు కూడా చెల్లించలేదని, తుప్పుపట్టిన మోటార్లంటూ అప్పటి మంత్రి కాకాణి నోటికొచ్చినట్టు మాట్లాడారని గుర్తుచేశారు. రెండురోజుల క్రితం తాను అంకుపల్లికి వచ్చినప్పుడు రైతులు సాగునీరు అందించాలని కోరడంతో అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి, ఇప్పుడు అందరి సమక్షంలో నీరు విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు.



శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా ఈ నెల 26న ఇస్కాన్ మందిరంలో జరిగిన వేడుకలలో ముఖ్యఅతిథిగా పాల్గొని వార్షిక సావనీర్ ఆవిష్కరించి, అనంతరం జరిగిన అభిషేక కార్యక్రమంలో శుకదేవిస్వామితో కలసి పాల్గొన్న నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ, ఐఏఎస్.

# ఫోర్జరీ కేసులో..టీపీఓ అరెస్టు

నెల్లూరు నగరపాలక సంస్థలో కమిషనర్ సంతకాల ఫోర్జరీ కేసులో పట్టణ ప్రణాళిక విభాగం అధికారి (టీపీఓ) దేవేంద్రను ఈనెల 26న నగర డిఎస్పీ శ్రీనివాసరెడ్డి అరెస్ట్ చేశారు. ఈ ఫోర్జరీ కేసుకు సంబంధించి ఇద్దరు టీపీఓలు, మేయర్ భర్త జయవర్ధన్, ఆయన సహాయకునితో పాటు మరో ఇద్దరు సచివాలయ ఉద్యోగులపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇటీవల జయవర్ధన్ సహాయకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న జయవర్ధన్, తదితరుల కోసం గాలిస్తున్నారు.

లాయర్
ఆగస్టు 30, 2024

# మాటల్లోనే 'అభివృద్ధి'.. చేతల్లో లేదు.. చిత్తశుద్ధి!

ప్రపంచంలోనే భారత్‌ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలబెడతామని మన ప్రభుత్వాలు గొప్పలు చెప్పుకుంటున్నా, ఆచరణలో దేశం పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నట్లుగానే ఉండడం విచారకరం. అభివృద్ధికి తగ్గ ప్రణాళికలు అమలులోకి రావడం లేదు. అన్ని రంగాల్లో అభివృద్ధి పరుగులు తీస్తుందని మాటలతో కాలం గడిపేస్తున్నారు తప్ప, ఆశించిన స్థాయిలో చేతలు ఉండడంలేదు. దేశంలో కోట్లాది మంది నేటికీ నిరుద్యోగంతో బాధలు పడుతున్నారు. జీవనోపాధి లేక, బతుకు బండిని లాగలేక ఎందరో నిరుద్యోగులు, కార్మికులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. దేశానికి వెన్నుదన్నుగా ఉండాల్సిన యువత ఇలా అసహాయులుగానే ఉంటుండడం బాధాకరం. ఇప్పుడని కాదు.. ఏళ్ళతరబడిగా ఈ దుస్థితి మారడమే లేదు. పేదరికం, నిరుద్యోగం, అసమానతల వంటివి దేశాన్ని అధోగతి పాలుచేస్తున్నా వాటి నివారణకు ప్రభుత్వాలు కానీ, పాలకులు కానీ చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవడం లేదు. తినడానికి తిండి, ఉండడానికి ఇల్లు కూడా లేని నిరుపేదలు దేశంలో కోట్లాదిమంది ఉన్నారు. విద్య, వైద్యం వంటివి కూడా అందరికీ అందడం లేదు. పెద్దపెద్ద చదువులు చదివిన యువతీ యువకులు కూడా 'నిరుద్యోగ పట్టాలు' చేతపట్టుకుని ఎక్కడ ఉద్యోగం దొరుకుతుందా అని ఆశగా ఎదురుచూస్తూనే ఉన్నారు. ఏటా రెండుకోట్ల ఉద్యోగాలిస్తామని ప్రధాని 2014లోనే హామీ ఇచ్చారు కానీ, అది నెరవేరి ఉంటే ఈ పదేళ్ళలో కనీసం 20 కోట్ల ఉద్యోగాలు వచ్చేవి. కానీ.. ఉద్యోగాలేవీ?.. ఇచ్చేదెవరు?.. అంతా నామమాత్రపు చర్యలే. కొత్త ఉద్యోగాల సంగతి తర్వాత, ఉన్న ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేయడంలో కూడా మీనమేషాలు లెక్కబెడుతుంటే ఇక నిరుద్యోగం తగ్గేదెక్కడా?.. మనదేశంలో గత ఏడాది 8.5 శాతం ఉన్న నిరుద్యోగ శాతం, ఈ ఏడాది జూన్ నాటికి 9.3 శాతానికి చేరిందంటూ నిపుణులు లెక్కలు కడుతున్నారు. అన్నిరంగాల్లో ధీటుగా రాణించేందుకు యువతను ప్రోత్సహించకపోవడం వల్లే దేశప్రగతి నత్తనడక నడుస్తోంది. అందులోనూ చదువుకున్న యువకుల కంటే యువతులే అత్యధికంగా నిరుద్యోగులుగా ఉండడం దురదృష్టకరం. ఆడపిల్లలు, మహిళలు ఎంతో కష్టపడి.. నేటి సమాజంలో ఎదురయ్యే అనేకానేక కష్టనష్టాలను ఎదుర్కొని ఉన్నత చదువులు చదువుకున్నా, చివరికి బతకడానికి సరైన ఉద్యోగం లేకపోతే వారి జీవితాలు ఎంత నిరాశామయంగా ఉంటాయో ప్రభుత్వాలు ఇకనైనా మనసుపెట్టి ఆలోచించాలి. ఉద్యోగ కల్పనలో ప్రపంచంలోని అనేక దేశాలన్నిటికంటే మనదేశం ఎంతో వెనుకబడి ఉందని అంతర్జాతీయ నివేదికలు హెచ్చరిస్తూనే ఉన్నాయంటే మనం ఎక్కడున్నామో, మన ప్రగతి గతి ఏస్థాయిలో ఉందో అర్థమవుతుంది. ముఖ్యంగా జీ-20 దేశాలతో పోల్చి చూసుకున్నా..మనదేశంలో ఉద్యోగ కల్పన వాటికంటే చాలా తక్కువగానే ఉంది. అంతమాత్రాన దేశంలో అసలు పురోగతి అన్నదే లేదని అనలేం. గతంతో పోలిస్తే ఇప్పుడు దేశంలో ఎంతోకొంత వృద్ధి కనిపిస్తోంది. ఉద్యోగాల భర్తీ విషయంలో కూడా మునుపటికంటే కొంత మేలే. అయినప్పటికీ, సాధించాల్సింది ఇంకా కొండంత ఉంది. ఆర్థిక వ్యవస్థ మెల్లగా బలపడుతుండడం నిజమే అయినా, మరోవైపు వేగంగా పెరిగిపోతున్న నిరుద్యోగాన్ని కూడా గమనిస్తే, అత్యధిక జనాభాతో అల్లాడుతున్న మనదేశంలో నిరుద్యోగ భూతాన్ని జయించడానికి ఇప్పుడు తీసుకుంటున్న చర్యలు ఏమాత్రం చాలవనే విషయం స్పష్టమవుతుంది. అయినా, మన సమాజంలో ఎంతోకాలంగా పాతుకుపోయిన పేదరికాన్ని, నిరుద్యోగాన్ని పారద్రోలాలంటే మాటలతో అయ్యేపని కాదు. దేశమంతా పేరుకుపోయిన అసమానతలు అంత సులభంగా పోవు. అందుకు గట్టి పట్టుదల కావాలి. మరింత పటిష్టమైన కార్యాచరణ పథకాలు రావాలి. అటు ప్రభుత్వపరంగానూ, ఇటు ప్రైవేట్‌పరంగాను పరిశ్రమలు భారీగా పెట్టాలి. నైపుణ్యంతో కూడిన సాంకేతిక విద్యను అందరికీ అందుబాటులోకి తేవాలి. సంఘటిత, అసంఘటిత రంగాల్లో కోట్లాదిమంది నేటికీ నిరుద్యోగం కోరలకు చిక్కుకునే ఉన్నారు. ఉపాధి, ఉద్యోగ కల్పనల ద్వారా వారిని ఆదుకోవాలి. అభివృద్ధి అంటే ఏ కొందరి అభివృద్ధో కాదు.. ప్రజలందరి అభివృద్ధి, దేశ సమగ్రాభివృద్ధితోనే అది సాధ్యం కనుక, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇకనైనా మేలుకొని ఆ దిశగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. నిరుద్యోగ భారంతో, ఆర్థిక అసమానతలతో కొట్టుమిట్టాడుతున్న దేశాన్ని ప్రగతిదారిలో పెట్టేందుకు కేంద్రప్రభుత్వం మరిన్ని పథకాలకు సమాయత్తం కావాలి. ఏదేమైనా సరే, నిరుద్యోగాన్ని జయించాలి. అప్పుడే భారత్‌లో ఎల్లెడలా సంతోషం కనిపిస్తుంది. 'వికసిత్ భారత్' కూడా కళ్ళముందు సాకారమవుతుంది.

## ఈవీయంలపై కేంద్రం స్పష్టత ఇవ్వాలి!

ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాలలో "పోలైన ఓట్లకన్నా లెక్కించిన ఓట్లు ఎక్కువ" అని ఒక ప్రైవేటు సంస్థ ప్రకటించడం ప్రజలలో అనేక అనుమానాలకి తెరలేపుతోంది. ఇదే నిజమైతే... రాజకీయ విశ్లేషకులు, విమర్శకులు చెప్తున్నట్లుగా ఇది ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమైన పరిణామం. వ్యవస్థల మనుగడకే ప్రశ్నార్థకమైన అంశం. ఈ విషయంలో కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం మంచిది కాదు. మహారాష్ట్రకు చెందిన 'ఓట్ ఫర్ డెమోక్రసీ' అనే సంస్థ




చేసిన ఆరోపణలపై సరైన ఆధారాలు ఇవ్వమని కేంద్రం అడగాలి. సదరు సంస్థ ఆధారాలు ఇవ్వని పక్షంలో ఆ సంస్థపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి. తమకి కావలసిన నాయకులని, ప్రభుత్వాలని, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకుంటున్న భారతీయ ఓటర్ల మనోభావాలకు, వారి భవిష్యత్తుకి సంబంధించిన ఇలాంటి విషయాలని కేంద్రం తీవ్రంగా పరిగణించాలి. నిజానిజాల నిగ్గు తేల్చాలి. ముఖ్యంగా గత దశాబ్దకాలంగా దేశాన్ని పాలిస్తున్న కమల దళమన్నా, ఆ దళానికి నాయకత్వం వహిస్తున్న నరేంద్ర మోడీ పాలన అన్నా దేశ ప్రజలు విశ్వసిస్తున్నారు. ఆ నమ్మకాన్ని కాపాడుకోవలసిన అవసరం ఆ పార్టీకి ఉంది. ఈవీయంలపై వచ్చిన ఆరోపణలపై స్పష్టత ఇవ్వవలసిన బాధ్యత కూడా బీజేపీపై ఉంది.

*యం. చంద్రమౌళి*, **కొత్త ఢిల్లీ.**

## నిరంతరాయ విద్యుత్ కోసం కొమ్మలు కొట్టాలి!

వర్షాకాలం రాబోతోంది. నగరంలో ఎక్కడ చూసినా చెట్టు కొమ్మలు పెరిగి కరెంటు తీగలపై వాలుతున్నాయి. చిన్న పాటి గాలి వచ్చినా కరెంటు పోతోంది. ఇక వర్షాకాలం వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. విద్యుత్ శాఖ ముందే మేల్కొని, గతానుభవాలని దృష్టిలో పెట్టుకుని ముందుజాగ్రత్త చర్యగా ఇబ్బందికరమనిపించే కొమ్మలని తొలగించాలని అధికారులని, సిబ్బందిని కోరుతున్నాను.

*ఆర్.పి.రామయ్య*, **కొండాయపాలెం.**

## రాజకీయాల ఉచ్చులో యువతరం!

నేటి సమాజంలో యువత నడత చూస్తుంటే ఆందోళన కలుగుతోంది. స్వార్థపూరితమైన రాజకీయ నాయకులు తమ స్వప్రయోజనాల కోసం యువతరాన్ని పెడత్రోవ పట్టిస్తున్నారు. టీనేజ్‌లో వున్న యువకులను ఆకర్షించి వారిని చెడు వ్యసనాలకు బానిసలని చేస్తున్నారు. తమ ఆదేశాలని పాటించేలా వారిని వశపరచుకుంటున్నారు. పరమ నికృష్టంగా తయారైన రాజకీయవ్యవస్థ ఉచ్చులో నేటి యువత చిక్కుకుపోతోంది. రాజకీయ రొంపిలో ఒకసారి దిగిన తరువాత ముందుకు వెళ్లలేక, వెనక్కి రాలేక యువత సతమవుతోంది. యువత బలహీనతలని, వారి ఆర్థిక స్థితిగతులని ఆసరాగా చేసుకుని వారిని తమ అవసరాలకి రాజకీయ నాయకులు వాడుకుంటున్నారు. అవసరమైతే తమ స్వార్థం కోసం వారి చేత దాడులు, దౌర్జన్యాలతోపాటు హత్యలు చేయించడానికి కూడా వెనుకాడడం లేదు. సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు ఈ విషయంపై దృష్టిపెట్టి కౌన్సిలింగ్ ద్వారా యువతలో మార్పు తేవలసిన అవసరం ఉంది! *– ఎస్.రంగారెడ్డి*, **గూడూరు.**




# జైలు పక్షులకి జై..జై...!

జైలుకెళ్ళడమంటే నామూషి.
జైలుకెళ్ళడమంటే అవమానం.
జైలుకెళ్ళడమంటే పరువు తక్కువ....
జైలుకెళ్ళడమంటే సిగ్గుచేటైన విషయం.
జైలుకెళ్ళిన వారిని సమాజం బహిష్కరిస్తుంది.
జైలుకెళ్ళిన వారిని జనం చులకన భావంతో చూస్తారు.
జైలుకెళ్ళిన వారిని తమకి తెలుసని చెప్పుకోవడానికి కూడా ఇష్టపడరు.

### అది ఒకప్పటి మాట, కానీ ఇప్పుడు...

జైలుకెళ్ళడమంటే స్టేటస్.
జైలుకెళ్ళడమంటే గర్వకారణం.
జైలుకెళ్ళడమంటే పాపులారిటీ.
జైలుకెళ్ళడమంటే హుందాతనం.
జైలుకెళ్లొస్తే రాజకీయాలలోకి రావడానికి అర్హత సాధించినట్లే.
జైలుకెళ్లొస్తే రాష్ట్రాలని పరిపాలించడానికి రాజముద్ర వేయించుకున్నట్లే.
జైలుకెళ్లొస్తే ఏంఎల్ఏ, ఎంపీ, మంత్రి, చివరికి ముఖ్యమంత్రి కూడా కావొచ్చు.

### పాత తరంలో...

స్వాతంత్ర్య సమరంలో పాల్గొని బ్రిటిష్ ముష్కరులపై తిరుగుబాటు చేసి ప్రాణాలొడ్డి పోరాడిన కొన్ని వేలమంది జైళ్ల పాలయ్యారు. అధికార లెక్కల ప్రకారం ఒక్క నెల్లూరుజిల్లాలోనే స్వాతంత్రోద్యమంలో జైళ్లకి వెళ్లిన వాళ్ళు 443 మంది ఉన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత వారిలో చాలామంది ప్రత్యక్ష రాజకీయాలలోకి కూడా వచ్చారు. డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి, బెజవాడ రామచంద్రారెడ్డి, ఆనం చెంచుసుబ్బారెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్య, రేబాల దశరథరామిరెడ్డి, వెన్నెలకంటి రాఘవయ్య, పొణకా కనకమ్మ, ఆమంచర్ల గోపాలరావు, వంగల్లు కోదండరామిరెడ్డి, బత్తెన రామకృష్ణారెడ్డి, బసవారెడ్డి శంకరరెడ్డి, ఓరుగంటి వెంకటసుబ్బయ్య లాంటి వారెంతోమంది ప్రత్యక్ష రాజకీయాలలో తమ ప్రతిభ చూపారు. ఢిల్లీ నుండి గల్లీ దాకా ప్రజలకి స్వచ్ఛమైన సేవలు అందించారు. నిరాడంబరతతో, స్వప్రయోజనాలు చూసుకోకుండా నిస్వార్థంగా సమాజ శ్రేయస్సు కోసం శ్రమించారు. దేశ భవిష్యత్తుకు అహరహం తపించారు. భావితరాలకు స్ఫూర్తి ప్రదాతలుగా అవతరించి, ఎంతోమందికి మార్గదర్శకులై ఆదర్శంగా నిలిచారు. జనం గుండెల్లో చిరస్మరణీయులుగా కొలువై, వారి మనస్సులో మిగిలిపోయారు. మహానుభావులుగా, మహనీయులుగా చరిత్రలో నిలిచిపోయారు.

దేశానికి స్వాతంత్ర్యం తేవడం కోసం పోరాటాలు చేసి జైల్లపాలై, రాజకీయాలలోకి రావడానికి అర్హత సాధించిన ఘనచరిత్ర ఆ తరం నాయకులది.

### నేటి తరంలో...

ఆర్థికనేరాలు చేసి జైళ్లకు వెళ్తున్నారు. రాజకీయ పదవులని అడ్డం పెట్టుకుని వేలకోట్ల రూపాయల కుంభకోణాలు చేసి జైళ్లకి వెళ్తున్నారు. కొత్తగా ఈవీయంలు పగలగొట్టి కూడా జైళ్లకి వెళ్తున్నారు. కేవలం వ్యాపార వేత్తలు, రాజకీయ నాయకులే కాకుండా ప్రభుత్వ అధికారులు కూడా రాజకీయ నాయకుల అడుగులకి మడుగులొత్తి కటకటాల పాలవుతున్నారు.

### చరిత్ర తిరగేస్తే....

ఇందిరాగాంధీ, మురార్జీ దేశాయ్, కరుణానిధి వంటి పాతతరం నేతలు రాజకీయ కక్షలతో జైళ్లపాలయితే... లాలూ ప్రసాద్‌యాదవ్, మధుకోడా, కనిమొళి, వై.ఎస్.జగన్, చంద్రబాబునాయుడు, కేజ్రీవాల్, కవితలతో పాటు ఇంకా చాలామంది రాజకీయ నేతలు ఆర్థిక నేరారోపణలతో జైళ్లకి వెళ్లారు.

### జై... జై అంటున్న జనం!

రాజకీయనేతలు జైళ్లకి వెళ్లడం, బెయిళ్లపై బయటకి రావడం అదంతా వాళ్ళ వాళ్ళ తలరాత. ఇక్కడ మనం మాట్లాడుకోవలసిన విషయం ఒక్కటే. జైళ్లకి వెళ్లి బెయిళ్లపై వస్తున్న వారికి ఈ అమాయక జనం స్వాగతం పడుతున్న తీరే ఇక్కడ చర్చనీయాంశం. ప్రభుత్వాలని, ప్రజలని ముంచి వందల కోట్లు దోచేసి కొందరు, రాజకీయ ద్వేషాలతో మరికొందరు, తీవ్రమైన నేరాలకు పాల్పడి ఇంకొందరు జైళ్లకి వెళ్లి బెయిళ్లపై బయటకి వస్తుంటే వాళ్లకి పిచ్చి జనం మంగళహారతులు పడుతున్నారు. జైజై. ధ్వనులతో స్వాగతం పలుకుతున్నారు.

చెంచల్‌గూడ జైలు నుండి 2013 సెప్టెంబర్ 23న సాయంత్రం 4గంటలకి వై.ఎస్.జగన్ విడుదలై బయటకివస్తే అదే హైదరాబాదులోని లోటస్‌పాండ్ ఇంటికి ఆయన చేరుకోవడానికి ఏ అర్ధరాత్రో పట్టింది. వేలాదిమంది అభిమానులు జైలు నుండి ఇంటివరకూ ఆయన వెంట నడిచారు.

సరిగ్గా పది సంవత్సరాల తరువాత 2023 అక్టోబర్ 31న సాయంత్రం 4గంటలకి చంద్రబాబునాయుడు రాజమండ్రి సెంట్రల్ జైలు నుండి విడుదలైతే విజయవాడలోని ఆయన ఇంటికి చేరుకోవడానికి పక్కరోజు తెల్లవారింది. దారిపొడవునా ప్రజలు ఆయనపై పూలవర్షం కురిపించారు. అర్ధరాత్రి, తెల్లవారుఝామున సైతం జనం రోడ్లపై నిలబడి ఆయనకి నీరాజనాలు పలికారు.

మొన్నటి ఎన్నికలలో ఇవీఎంల ధ్వంసం కేసులో అరెస్టైన పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని సాక్షాత్తూ మాజీ ముఖ్యమంత్రి జగన్ నెల్లూరు సెంట్రల్ జైలుకి వచ్చి పరామర్శించారు. పైగా ఆయన నేరాన్ని సమర్థించారు. అదే పిన్నెల్లికి బెయిలొస్తే తగుదునమ్మా అంటూ ఇద్దరు మాజీమంత్రులు వానర సమూహంతో వెళ్లి స్వాగతం పలికారు. పైగా పిన్నెల్లిపై అక్రమ కేసు బనాయించారని మీడియా ముందు మాట్లాడారు. ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగబద్ధంగా జరిగే ఎన్నికలలో ఈవీయంలని పగలగొట్టడం తీవ్రమైన నేరమని కూడా తెలియని ఈ ప్రబుద్ధులు మనకి మాజీమంత్రులని చెప్పుకోవడానికే తెలుగువారు సిగ్గుపడాలి. ఇక తాజాగా లిక్కర్ కేసులో కేసీఆర్ ముద్దుల తనయ కవిత మంగళవారం రాత్రి బెయిలుపై జైలు నుండి బయటకొచ్చారు. ఆమెకి బిఆర్ఎస్ పార్టీశ్రేణులు ఘనంగా స్వాగతంపలికారు. బయటకొచ్చిన తరువాత ఆమె కొంతసేపు భావోద్వేగానికి లోనయ్యింది. ఆ తరువాత బిఆర్ఎస్ నాయకులకి, కార్యకర్తలకి పిడికిలి చూపిస్తూ ఆమె తన సహజనైజాన్ని బయటపెట్టింది. తన తప్పులేకుండా తనని అరెస్టు చేయించిన వారికి వడ్డీతో సహా మూల్యం చెల్లిస్తామని మీడియా ముందు ఆమె వార్నింగ్ కూడా ఇచ్చింది. అవన్నీ గమనిస్తే గతి తప్పిన మన వ్యవస్థల దుస్థితికి, ఆ వ్యవస్థల వెనుక నడుస్తున్న అమాయకపు ప్రజల పరిస్థితికి ఇలాంటి సంఘటనలు అద్దం పడుతున్నాయనడానికి సందేహమే అవసరం లేదు. ప్రజాస్వామ్యమా వర్ధిల్లు!

అందుకే అంటున్నాం... జైలు పక్షులకి జై.. జై...!! *- రాజశ్రీ*

# గ్రామీణవాసుల దాహం తీరుస్తున్న జలదాత

## నార్త్‌మోపూరులో 'విపిఆర్ అమృత ధార'



పరిశుభ్రమైన మంచినీరు లభించక ఇబ్బందులు పడుతున్న గ్రామాల్లో ప్రముఖ దాత, విపిఆర్ ఫౌండేషన్ అధినేత, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తమ సొంత నిధులతో మంచినీటి ప్లాంట్‌లు ఏర్పాటుచేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇటీవల అల్లూరు మండలంలోని నార్త్‌మోపూరు గ్రామంలో 'విపిఆర్ అమృతధార' కార్యక్రమం కింద వాటర్‌ప్లాంట్‌ను విపిఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా దాదాపు 150 అమృతధార వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశామన్నారు. వాటి నిర్వహణను కూడా ఫౌండేషన్ తరఫునే చేస్తున్నామని, అన్ని ప్లాంట్‌లు సక్ర మంగా పనిచేస్తుండడం సంతోషకరమని చెప్పారు. ఒక్క కావలి నియోజకవర్గంలోనే దాదాపు 18 వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశామంటూ, తమ ఫౌండేషన్ తరఫున ఇంకా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడుతూ, విపిఆర్ తన సేవాభావంతో అమృతధార వాటర్‌ప్లాంట్ల ద్వారా వేలాదిమంది ప్రజల దాహార్తి తీరుస్తున్నారని కొనియాడారు. టీడీపీ నాయకులు బీద గిరి, వేమిరెడ్డి కోటారెడ్డి, రేబాల శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తన సొంత గ్రామమైన ఇందుపూరులో శివయ్య స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

# అష్టదిగ్బంధనంలో బాబు!

(మొదటిపేజీ తరువాయి)

పనిచేస్తే మంచిది. అధికారంలోకి వచ్చిన కొత్తలో చంద్రబాబు మాటలివి. ఈ మాటలకు అధికారుల వెన్నులో వణుకుపుట్టింది. ప్రజల మనస్సులో ఆనందం వెల్లివిరిసింది. బాబుమార్కు పాలనతో త్వరలోనే రాష్ట్రం అభివృద్ధి పట్టాలెక్కుతుందని అందరూ భావించారు. అయితే, మొన్న బుధవారం క్యాబినెట్ మీటింగ్ తరువాత ప్రెస్‌మీట్ పెట్టిన బాబుని చూస్తుంటే... ఆయనలో కొత్త బాబు కనిపించారు. ఆయన విలేఖరులతో మాట్లాడుతూ "నామినేటెడ్ పదవుల కోసం అశావహుల సంఖ్య పెరిగింది, గతంలో అయితే తానొక్కడినే నిర్ణయం తీసుకునే వాడిని, ఈసారి అలాకాదు, ఒకపక్క బీజేపీ, మరోపక్క జనసేనలతో పాటు ఇంకా చాలామందికి నేను సమాధానం చెప్పాలి, ఈ సమయంలో అందరికీ న్యాయం చేయాల్సిన బాధ్యత నాపై ఉంది" అని అన్నారు.

నిజానికి పాత బాబు అయితే ఇలా చెప్పేవారు కాదు, ఇంత ఆలోచనచేసే వారు కాదు. వయసు, అనుభవం, నిబద్ధత... ఇవన్నీ చంద్రబాబులో బాగా పెరిగినట్టున్నాయి. అందుకే ఇతరుల గురించి ఆలోచించటం మొదలుపెట్టారు. కారణాలు ఏవైనా ఎవరినీ లెక్కచేయని బాబు, అందరి మధ్య లెక్కలు వేసుకుంటూ పాలన సాగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నది మాత్రం స్పష్టమయింది. ఎప్పుడూ నేను చెప్పిందే ఫైనల్ అని చెప్పే బాబు నోట అందరినీ కలుపుకుని పోవాలనే కొత్త మాట వినిపిస్తోంది. ఇది ఓ రకంగా మంచిదే. ఇప్పటివరకూ చాలామందిలో 'బాబు మాట నిలబెట్టుకోరు' అనే ఓ అపోహ లాంటి అపవాదు ఉంది. ఈరోజు ఆయన చెప్పిన మాటల కారణంగా ఆయన మారారనే విషయం స్పష్టమవుతోంది.

### బీజేపీ - జనసేనలే సమస్య కాదు!

గతంలో కూడా టీడీపీ ఎప్పుడూ ఒంటరిగా గెలవలేదు. ఏదో ఒక పొత్తుతోనే గెలుస్తూ వచ్చింది. అలాంటి పరిస్థితుల్లో కూడా బాబు ఎప్పుడూ ఇలా మాట్లాడలేదు. ఇప్పుడు తనకి బ్రేకులేస్తుంది బీజేపీ, జనసేన అని చెప్పి నెపం వారిమీదికి తోసేయాలని చూస్తున్నప్పటికీ ఇక్కడ లోకేష్, బాలకృష్ణల ప్రాముఖ్యతని కూడా మనం మర్చిపోకూడదు. వాళ్ళిద్దరూ ఓ ప్రత్యేకమైన ప్రభుత్వాన్ని నడుపుతున్నారనే మాట కూడా అటు రాజకీయ వర్గాలలోనూ, ఇటు అధికార విభాగాలలోను జోరుగా వినపడుతోంది. బాబు తర్వాత భవిష్యత్ లోకేష్‌దే కనుక, రానున్న కాలంలో ఆయనకు ఏ ఇబ్బంది లేకుండా చూడాలన్నదే ఇక్కడ ప్రధానం. మామ హోదాలో లోకేష్‌కు అండగా నిలబడాలి గనుక బాలకృష్ణ మాటను కూడా ఖచ్చితంగా బాబు పరిగణనలోకి తీసుకుని తీరాల్సిందే. ఇలా మొదటి నాలుగు కారణాలు రాజకీయంగా బాబును ఇబ్బంది పెడుతున్న అంశాలు.

### మీడియా ఋణం తీర్చుకోవాలి!

వీటితోపాటు టీవీ-5, ఆంధ్రజ్యోతి, ఈటీవీ రూపంలో బాబును మరో ప్రమాదం వెన్నంటుతూనే ఉంది. ఎవరో ఒకరి పేరు ఏదో ఒక పదవికి తెరమీదకు తీసుకురావటం ద్వారా కొత్త ఊహలకు తెరలేపుతోంది ఈ మీడియా. మీడియా అధినేతలు కూడా ఆశావహులలో ఉన్నారన్న ప్రచారం కూడా ముమ్మరంగా వినిపిస్తోంది. ఇప్పటికే టీటీడీ ఛైర్మన్‌గా బి.ఆర్.నాయుడు (టీవీ5 అధినేత) పేరు దాదాపుగా ఖరారైనట్లు కూడా వార్తలు పొక్కాయి. వివిధ కార్పొరేషన్లకి సంబంధించిన నామినేటెడ్ పోస్టుల జాబితా కూడా ఈమధ్య ఒకటి సామాజిక మాధ్యమాలలో చక్కర్లు కొట్టింది. కాస్తో కూస్తో పలుకుబడి ఉన్న రాజకీయ నిరుద్యోగులు కూడా తమకు అనుకూలంగా వార్తలు రాయించుకుని బాబు మీద ఒత్తిడిని మరింత పెంచుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరి మాట వినాలో, ఎవరి మాట వినకూడదో తెలియని పరిస్థితిలో బాబు ఇరుక్కుపోయారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన కొత్తలో మంత్రులు ఎవరన్నది మీడియాలో ఓ పెద్ద చిట్టా వచ్చింది. అందులో ఉన్న చాలాపేర్లు ఇప్పుడు మంత్రివర్గంలో లేవు. మీడియా ఊహలు ఎలా ఉంటాయో, ఎందుకు ఉంటాయనేందుకు ఇదే పెద్ద ఉదాహరణ. తమకు అనుకూలంగా ఉన్న వారిని అందలాలు ఎక్కించేందుకు విలువలను పక్కనపెట్టి, అధికారానికి బంధనాలు వేయాలనుకునే ప్రయత్నాలలో ఇదో ప్రయోగం.

### పార్టీ శ్రేణులని సంతృప్తి పరచాలి!

బాబు ముందున్న సవాళ్ళలో అతిపెద్దది, ప్రధానమైనది... పార్టీ శ్రేణులని సంతృప్తి పరచడం. పొత్తుల్లో భాగంగా తమ సీట్లను వేరే వాళ్ళకు ఇచ్చి, వారి తరఫున ప్రచారం చేసి విజయ తీరాలకు చేర్చిన నాయకులని, పార్టీ కోసం జెండా మోసిన కార్యకర్తలని టీడీపీ ఎప్పుడూ మరువదు అనే పేరు ఆ పార్టీకి ఉంది. దాన్ని నిలబెట్టుకోవాలన్న బాధ్యత కూడా బహుశా చంద్రబాబు చేత అలా మాట్లాడించి ఉండొచ్చు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తాము టీడీపీ అని చెప్పటానికి చాలా ధైర్యం కావలసిన పరిస్థితి. టీడీపీలో ఉండటమే పెద్ద త్యాగం అన్నట్లుగా గత ఐదేళ్లు ఎన్నో కష్టనష్టాలని ఓర్చుకుని బాబుకు అండగా నిలబడి జెండా మోసిన టీడీపీ శ్రేణులు పదవులు ఆశించటంలో ఏ విధమైన తప్పులేదు. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అనేది వారి ఆలోచన. అయితే, బాబు తప్ప వారిని పట్టించుకునే స్థితిలో ఎవరూ లేకపోవటమే అసలు సమస్య.

### ప్రతిభని బట్టే పదవులు!

ఎన్ని అడ్డంకులు, అవరోధాలు ఉన్నా పదవులు ఇవ్వాల్సిందే. కానీ, కొన్ని పదవులకు ఎవరుపడితే వారు పనికిరారు. ప్రాధాన్యం కాదు అనుకునే పదవులు కూడా కొన్ని సమయాల్లో ప్రాముఖ్యత సంతరించుకుంటాయి. గతంలో బాబు ఇలాంటివి ప్రత్యక్షంగా చూశారు కూడా. అప్పట్లో కేసీఆర్‌కు మంత్రి పదవి ఇచ్చేసి ఉంటే ఇప్పుడు తెలంగాణ అన్న మాటే లేదు. ఇలాంటి విషయాలని ఖచ్చితంగా దృష్టిలో ఉంచుకోవాలి. ఆశావహులు చాలామంది ఉండొచ్చు. అయితే, కొన్ని పదవులు రాజకీయాలకు అతీతంగా, వారి అర్హతల మేరకు ఇవ్వాల్సి ఉంటుంది. బాబు వస్తే జాబు వస్తుందని యువత మాత్రమే కాదు, రాజకీయ నిరుద్యోగులు కూడా ఐదేళ్ల నుంచి ఎదురు చూస్తూనే ఉన్నారు. ఈ పరిస్థితుల్లో బాబు ఇచ్చే జాబు వాళ్ళకు ఉపయోగపడటంతో పాటు ప్రజలకు మరింత మేలు చేయగలిగేదిగా ఉండాలన్నది అందరి ఆకాంక్ష. అష్టదిగ్బంధనంలా తన చుట్టూ ఉన్న సమస్యలని, సవాళ్ళని అధిగమించి పదవుల పందారం చేయడంలోనే బాబు చతురత, చాతుర్యం, అనుభవం బయటపడుతాయి.

### పట్టాలెక్కని పాలన!

నిజానికి రాష్ట్రంలో ఇప్పటివరకూ పాలన పట్టాలు ఎక్కలేదు. రోడ్లమీద గుంతలు అలానే ఉన్నాయి. ఈమధ్య ప్రభుత్వం పోయించిన ఫ్లైయాష్ బూడిదకన్నా గతంలోవున్న గుంతలే మేలనే మాట కూడా వినపడింది. రోడ్లు ఎప్పుడు బాగుపడతాయో తెలియదు, ఆగిపోయిన అభివృద్ధి ఎప్పుడు మొదలౌతుందో తెలియదు, రెడ్‌బుక్‌లో ఉన్నవారి భవిష్యత్తు ఏమిటో తెలియదు. ఏ విధంగా చూసినా రాష్ట్రంలో గందరగోళ పరిస్థితి నెలకొని ఉంది. కేంద్రం తోడుగా, బాబుకి అధికారం ఇచ్చాం కనుక పాలనా సంస్కరణల వేగం మరింత పెరుగుతుందని ప్రజలు భావిస్తున్నారు. రాబోయే ఐదేళ్ళు ఏం చేయబోతున్నారో అన్న ఆసక్తితో, తమ బతుకులు బాగుపడతాయన్న ఆశతో ఎదురుచూస్తున్నారు. కనీసం సరైన రాజధాని కూడా లేని రాష్ట్రంలో అవకాశాల కోసం యువత ఎదురుచూస్తోంది. ఈ పరిస్థితులన్నీ బేరీజు వేసుకుంటూ చంద్రబాబు తన పాలనమీద మరింత దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం బాబును చూస్తుంటే... అధికారంలోకి వచ్చిన కొత్తలో ఎన్డీయే కష్టాలు కనిపిస్తున్నాయి. అప్పటికి వాజ్‌పేయి, అద్వానీలకు అధికారం కొత్త. కానీ బాబుకు అలాకాదు. ఎలాంటి సమస్యలనైనా ఇట్టే పరిష్కరించగలరనే పేరుంది. రాజకీయ నాయకుడిగా నాలుగు దశాబ్దాలచరిత్ర, ముఖ్యమంత్రిగా పద్నాలుగున్నర సంవత్సరాల అనుభవం ఆయన ఆభరణాలు.

నామినేటెడ్ పదవుల పంపకాన్ని నాన్చకుండా త్వరితగతిన భర్తీ చేసి, పూర్తిస్థాయిలో పాలనా ప్రక్షాళనపైన బాబు దృష్టిపెట్టాలని ప్రజల ఆకాంక్ష...!



# వెంకయ్యస్వామి ఆశీస్సులు అందరికీ ఉండాలి

## - ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం మండలం గొలగమూడి క్షేత్రంలో అవధూత, భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారి 42వ ఆరాధన ఉత్సవాల్లో భాగంగా, ఈనెల 24న స్వామివారికి సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సోమిరెడ్డి మాట్లాడుతూ, వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాల్లో పట్టువస్త్రాలు సమర్పించే మహద్భాగ్యం తనకు కలిగినందుకు ఆనందంగా ఉందన్నారు. భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి, శ్రీ ఆంజనేయస్వామి వార్ల ఆశీస్సులతో పాటు సకల దేవతల దీవెనలతో, ప్రజల అండదండలతో ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో విజయం సాధించానని, ప్రత్యేకించి నామినేషన్ దాఖలు సమయంలో తాను వెంకయ్య స్వామిని దర్శించుకుని పూజలు చేశానని, శ్రీ స్వామివారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరికీ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. తొలుత, సోమిరెడ్డి దంపతులకు ఆలయ ఈఓ పి.బాలసుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు సాదరస్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. ఆ తర్వాత సోమిరెడ్డి దంపతులను గౌరవపూర్వకంగా సత్కరించారు.

# ఆలయ అభివృద్ధే ధ్యేయం

## - వెంకయ్యస్వామి ఆశ్రమ ఇఓ బాలసుబ్రహ్మణ్యం



వెంకటాచలం మండలం గొలగమూడిలో కొలువై ఉన్న అవధూత.. భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు ఆగస్టు 18 నుంచి 24వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరిగాయి. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, ఉభయదాతలు, భక్తుల సహాయ సహకారాలతో ఈ ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించామని, స్వామివారి ఉత్సవాలకు సహకరించినవారందరికీ కృతజ్ఞతలని ఆశ్రమ ఇఓ పి.బాలసుబ్రహ్మణ్యం చెప్పారు. ఆరాధనోత్సవాలు విజయవంతమైన నేపథ్యంలో ఈనెల 27న గొలగమూడిలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ ఉత్సవాలకు సుమారు 2లక్షల మంది దాకా భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారని, భక్తులందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశామని తెలిపారు. హైకోర్టు వారి ఆదేశాల మేరకు తాను ఆశ్రమ ఇఓగా వచ్చానని, ఆలయ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తూ, కమిటీ వారి సూచనలతో ఆశ్రమ పరిరక్షణకు బాధ్యతగా విధులు నిర్వహిస్తున్నామన్నారు. తాను బాధ్యతలు తీసుకునేనాటికి రూ.7 కోట్లు మాత్రమే ఉన్న స్వామివారి ఆస్తులను ఇప్పటికి రూ.200 కోట్లుగా వృద్ధిచేశామన్నారు. 'ఆకలైనవారికి అన్నం పెట్టాలనే' స్వామివారి ఆశయాలను భక్తితో పాటిస్తూ భక్తులందరికీ నిత్యాన్నదానం చేస్తున్నామని, ఏడాదికి కనీసం 10లక్షల మందికి పైగానే భక్తులకు ఉచిత భోజనం పెడుతున్నామని చెప్పారు. విద్య, వైద్యం తదితర సౌకర్యాలతో ఆశ్రమం తరఫున ప్రజలకు, విద్యార్థులకు, భక్తులకు ఎన్నో సేవా కార్యక్రమాలను చేస్తున్నామని తెలిపారు. గత 18 ఏళ్ళుగా ఒక్క రూపాయి కూడా జీతం తీసుకోకుండా ఇఓగా తాను విధులు నిర్వహిస్తూ, శ్రీ వెంకయ్యస్వామివారిపై అపారమైన భక్తితో పనిచేస్తూ, అందరి సహకారంతో ఆలయ అభివృద్ధికి బాటలు వేస్తున్నామన్నారు. తన హయాంలో ఒక్కరూపాయి అవినీతి జరిగిందని నిరూపించినా సరే, తాను ఏ శిక్షకైనా సిద్ధమన్నారు. వెంకయ్యస్వామికి వారసులమంటూ ఇటీవల ఆలయానికి వచ్చిన పలువురికి తాము ఆశ్రమం తరఫున మర్యాదపూర్వకంగా దర్శనం ఏర్పాట్లు చేసి గౌరవించినా, వారు తనపై లేనిపోని విమర్శలు చేయడం విచారకరమని ఆయన ఆ ఆరోపణలను ఖండించారు. తమపై ఎవరెన్ని అబద్దపు ఆరోపణలు చేసినా వెనుకాడకుండా.. శ్రీ వెంకయ్యస్వామి సేవకు మరింతగా కట్టుబడి పనిచేస్తామని, స్వామివారి ఆలయాన్ని షిరిడీ తరహాలో అభివృద్ధి చేయడమే తన ప్రధాన ధ్యేయమని ఇఓ స్పష్టం చేశారు.

# నెల్లూరు కబుర్లు

## ఆంధ్రకేసరి.. అందరికీ ఆదర్శం



ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు. టంగుటూరి వారి జయంతి సందర్భంగా ఇటీవల నెల్లూరు నగరంలోని మార్కెట్ ప్రాంతంలో ఉన్న టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ నేతలు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలతో కలిసి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ, అటు స్వాతంత్ర్య సంగ్రామం లోనూ, ఇటు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనలోనూ ప్రకాశం పంతులు కీలకపాత్ర పోషించారన్నారు. ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేసిన ప్రకాశం పంతులు జీవితం భావితరాలకు ఆదర్శం కావాలన్నారు. మాజీ మేయర్ భానుశ్రీ, నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 'అన్న క్యాంటీన్ల'కు..రూ.50వేల వితరణ



నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిల పిలుపుమేరకు సీనియర్ నేత బుర్రా వెంకటేశ్వర్లు గౌడ్ అన్న క్యాంటీన్ల నిర్వహణకు 50వేల రూపాయలను వితరణగా అందజేశారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఇటీవల ఆ విరాళం చెక్కును కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డికి ఆయన అందజేశారు. మాజీ మేయర్ భానుశ్రీ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి జన్ని రమణయ్య పాల్గొన్నారు.

## నూనె మల్లికార్జున్ ఆధ్వర్యంలో..శ్రీకృష్ణాష్టమి



శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఈనెల 26న నెల్లూరులోని ఆమని గార్డెన్స్‌లో జనసేన పార్టీ నాయకుడు నూనె మల్లికార్జున్‌యాదవ్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణపరమాత్మ విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి శ్రీకృష్ణభగవానుని దర్శించుకున్నారు. జనసేన నాయకులు గునుకుల కిషోర్, మాజీ కార్పొరేటర్ విశపు లలితారామ్, న్యాయవాది శ్రీరామ్, నాగిశెట్టి మురళీకృష్ణ, పవన్, రమణ, రవికుమార్, జమీర్, కృష్ణారెడ్డి, మార్కెట్ సురేష్, హరిరెడ్డి, గుర్రం కిషోర్, కాకు మురళి, నాగరత్నమ్మ పాల్గొన్నారు.

### 'హరే కృష్ణ' భజనలతో..

## మార్మోగిన 'ఇస్కాన్' మందిరం



శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఈనెల 26న నెల్లూరు నగరంలోని కృష్ణ మందిరాలు ప్రత్యేక అలంకారాలు, పూజలతో కళకళలాడాయి. ఇస్కాన్ మందిరంలో 'హరేకృష్ణ' భజనలు మార్మోగాయి. మందిరం అధ్యక్షులు డాక్టర్ శుకదేవస్వామి ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. మూలవర్లకు విశేష పుష్పాలంకరణ చేసి, భక్తిశ్రద్ధ లతో బాలకృష్ణునికి ఊంజల్ సేవలు నిర్వహించారు. కృష్ణాష్టమిని పురస్క రించుకుని మందిరంవారు ప్రత్యేక సావనీర్‌ను ఆవిష్కరించారు. అనంతరం భక్తులతో రాధాకృష్ణులకు పంచామృతాభిషేకాలు జరిగాయి. 108 వంటకా లతో స్వామివార్లకు నైవేద్యాలు సమర్పించారు. రాధాకృష్ణుల వేషధారణ లతో చిన్నారులు అలరించారు. ఈ పూజల్లో పాల్గొనేందుకు నగరప్రజలు పెద్దసంఖ్యలో ఇస్కాన్ మందిరానికి తరలిరావడంతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారింది. సాయంత్రం భజనలు, కీర్తనల పోటీలు పెట్టి, విజేతలకు మందిరం నిర్వాహకులు బహుమతులిచ్చి అభినందించారు.

## 'జీఎస్టీ'తో.. మెరుగైన ఫలితాలు

### కమిషనర్ పి.ఆనంద్‌కుమార్




భారత ప్రభుత్వం 'ఒకే దేశం-ఒకే మార్కెట్-ఒకే పన్ను విధానం' పేరుతో అమలుచేస్తున్న గూడ్స్ అండ్ సర్వీసు ట్యాక్స్ (జీఎస్‌టి) చెల్లింపు విధానంతో మెరుగైన సత్ఫలితాలు సాధిస్తున్నట్లు కేంద్ర జీఎస్‌టి ఏపీ కమిషనర్(ఆడిటింగ్ వింగ్) పి.ఆనంద్‌కుమార్ చెప్పారు. జీఎస్‌టి పన్ను విధానాన్ని ప్రవేశపెట్టి ఏడు వసంతాలు పూర్తయిన సందర్భంగా సాధించిన ప్రగతి, భవిష్యత్ కార్యాచరణపై ఇటీవల నెల్లూరులోని ఓ హోటల్‌లో చాంబర్ ఆఫ్ కామర్స్, ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా-నెల్లూరు శాఖ వారు సంయుక్తంగా నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, జీఎస్టీ విధానం రాక ముందు కేవలం 70లక్షలు మాత్రమే పన్ను చెల్లింపుదారులు దేశంలో వుంటే, ప్రస్తుతం ఆ సంఖ్య 1.40కోట్లకు చేరడం జీఎస్టీ విధానం ద్వారా సాధించిన ఫలితమని ఆయన చెప్పారు. జీఎస్టీ రిజిస్ట్రేషన్ విధానం కూడా చాలా సరళీకృతమైందన్నారు. వికసిత్ భారత్-2047 లక్ష్యంగా రానున్న ఐదేళ్లలో జీఎస్టీ విధానం ద్వారా పన్నుచెల్లింపుదారుల సంఖ్యను పెంచి దేశాభివృద్ధిలో భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా తమశాఖ పనిచేస్తుందన్నారు. వ్యాపారులు, ప్రజల నుంచి వసూలు చేస్తున్న ప్రతి రూపాయిని కూడా ప్రజలకే ఖర్చుపెట్టేందుకు ప్రభుత్వాలు జీఎస్టీ పన్ను విధానాన్ని మరింత సులభతరం చేస్తున్నట్లు ఆయన చెప్పారు. అనంతరం పలువురు ఆడిటర్లు, వ్యాపారవేత్తలతో చర్చావేదిక నిర్వహించారు. నెల్లూరు ఆడిట్ సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.ఉషాకిరణ్, చాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మెన్ సిహెచ్ యువ రాజేష్, డైరెక్టర్ కె గురుబ్రహ్మం, దాసా లక్ష్మీనారాయణ, నెల్లూరు ఆడిట్ సర్కిల్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



## వేమిరెడ్డి దంపతులను కలసిన రోహిత్‌రెడ్డి

'దిల్ దివానా' మూవీ ఫేమ్ రోహిత్‌రెడ్డి, మరియు వారి సోదరులు మడువు రాహుల్‌రెడ్డి ఇటీవల ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని.. వారి సతీమణి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని నెల్లూరులోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

## పోలూరు వారి సారస్వత సేవలు అపూర్వం



ఆంధ్ర వాల్మీకి బిరుదాంకితులు, బ్రహ్మశ్రీ పోలూరు హనుమజ్జానకీ రామ శర్మ సారస్వత సేవలు అపూర్వమని వక్తలు కొనియా డారు. ఈనెల 25న నెల్లూరులోని వర్ధమాన సమాజం సమావేశమందిరంలో హనుమజ్జానకీ రామశర్మ శతజయంతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. పద్యకళా పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త సింగరాజు రామకృష్ణప్రసాద్‌రావు పాల్గొని పోలూరి వారి సాహితీ వైశి ష్ట్యాన్ని వివరించారు. అనంతరం ఆయన్ను పద్యకళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, కార్యదర్శి చీమకుర్తి వెంకటేశ్వరరావు, కోశాధికారి నలుబోలు బలరామయ్యనాయుడు, నిర్వాహకులు వేదం రాధాకృష్ణమూర్తి, శ్రీరామమూర్తి, మురళీకృష్ణ తదితరులు సన్మానించారు.

## సాయిదర్బార్‌లో.. భక్తిశ్రద్ధలతో వేడుకలు



నెల్లూరు పద్మావతినగర్‌లో ఉన్న శ్రీ సాయిదర్బార్ అద్దాల మందిరం లోని శ్రీసాయిమాత నిత్య అన్నప్రసాదాలయం తృతీయ వార్షికోత్సవం, శ్రీకృష్ణజన్మాష్టమిల సందర్భంగా ఈనెల 26న వేడుకలు ఘనంగా జరి గాయి. శ్రీ సాయినాధునికి ప్రత్యేక అలంకరణలు చేసి, పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. విశేష పుష్పాలంకరణతో, వేదమంత్రోచ్ఛారణలతో, ముత్యాల తలంబ్రాలతో స్వామివారి పెళ్ళివేడుక నయనానందకరంగా సాగింది. మందిరం ఛైర్మెన్ మధుసాయి నేతృత్వంలో, వేదపండితులు వేదగిరి ఫణిశర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణోత్స వంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శ్రీ సాయిదర్బార్ గౌరవ సలహాదారు పాబోలు రామసుబ్బయ్య, భక్తమండలి వారు పాల్గొన్నారు.






## గణేశ్ ఉత్సవాలకు.. సన్నాహాలు

### - విక్రమసింహపురి గణేష్ ఉత్సవ సమితి



వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని నెల్లూరు నగరంలో పలుకూడళ్ళలో నిర్వహించే వినాయక చవితి ఉత్సవ మండప నిర్వాహకులతో ఇటీవల స్థానిక విక్రమసింహపురి గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమితి అధ్యక్షులు పి.సత్య నాగేశ్వరరావు అధ్యక్షతన్వంలో, గౌరవాధ్యక్షులు భయ్యా వాసు, ప్రధాన కార్యదర్శి పి సురేంద్రరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు వేలూరు మహేష్ తదితరులు పాల్గొని ఏర్పా ట్లపై చర్చించారు. విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి కార్యాలయం ట్రంకురోడ్డు శివాజీ సెంటర్ వద్దనున్న టీవీఎస్ కళ్యాణ సదన్‌లో సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ప్రారం భమై ఉత్సవాలు పూర్తయ్యే వరకు పనిచేస్తుందని చెప్పారు. గత సంవత్సరం లాగే ఈసారి కూడా నగరంలోని అన్ని గణేష్ మండపాలకు సింగిల్ విండో పద్ధతిన అనుమతులు అందజేసేందుకు తమ కార్యాలయం పని చేస్తుందన్నారు. కార్యదర్శి కొండపల్లి శ్రీకాంత్, కోశాధికారి ఎవిఆర్ మోహన్‌రావు, కెవి సుబ్రమణ్యం, పి.భాస్కరరావు, బి.మల్లికార్జునరెడ్డి, నూకరాజు మహేష్, కృష్ణారెడ్డి, మండ్ల ఈశ్వరయ్య, హర్షవర్ధన్, శ్రీనివా సులురెడ్డి, కాకు మురళీరెడ్డి, డి.టి హరికృష్ణ పాల్గొన్నారు.

# అనాధలకు, అసహాయులకు వారే అండ

## వాత్సల్యకు వేమిరెడ్డి దంపతుల రూ.5 లక్షల విరాళం

నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, ప్రముఖ దాత, సేవాభూషణులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఆయన సతీమణి.. కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంప తులు తమ మానవీయతను మరోసారి చాటుకున్నారు. నిరాధార బాలబాలికలు, వృద్ధులు, నిరుపేదలకు ఆశ్రయమిస్తున్న నగరంలోని జనహిత వాత్సల్య సేవా సంస్థకు ఇటీవల 5 లక్షల రూపాయలను విరాళంగా అందించారు. నెల్లూరులోని తమ నివాసంలో వాత్సల్య సంస్థ కార్యదర్శి జీవీ సాంబశివరావుకు వారు ఇటీవల ఆ విరాళం చెక్కును అందించారు.



ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ, గత 36 ఏళ్లుగా వాత్సల్య సేవా సంస్థకు వేమిరెడ్డి దంప తులు చేస్తున్న సాయం నిరుపమానమని అన్నారు. ప్రతి ఏటా ఆగస్టు నెలలో సంస్థ నిర్వహణ కోసం రూ. 5 లక్షలు అందించడం ఎంతో గొప్ప విషయమని, విపిఆర్ దంపతులు మానవత్వానికి, ఉదారత్వానికి అది నిదర్శన మని ఆయన కొనియాడారు. అందు లోనూ, నిరుపేద దళిత విద్యార్థులకు వాత్సల్య విద్యా సంస్థ ద్వారా ఉచిత విద్యను అందించడం సంతోషకరమని అన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు కేవలం ఆర్థిక సహాయం చేయ డమే కాకుండా.. సంస్థలోని నిరాధార బాలబాలికలు, వృద్ధులు, నిరుపేదల బాగో గులను నిరంతరం పర్యవేక్షిస్తుంటారని ఆయన చెప్పారు. వాత్సల్య సంస్థలో ఉన్న అభాగ్యులకు, అనాధలకు అన్ని సదుపా యాలు ఏర్పాటుకు ఎంతగానో సహకరి స్తున్నారని, వారి చల్లని దీవెనలతో ఆశ్ర మంలో మంచినీటి సదుపాయం వంటి ఇతర మౌలిక సదుపాయాలను కల్పించా రని, వారి మంచితనం సమాజానికే ఆదర్శమన్నారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులను సంస్థ కార్యదర్శి సాంబశివరావు శాలువాతో సత్కరించి కృతజ్ఞతాపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## దివ్యాంగునికి.. ఎంపీ వేమిరెడ్డి సాయం

రైలు ప్రమాదంలో రెండు కాళ్ళు కోల్పోయిన ఓ దివ్యాంగుడికి నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేసి ఆదుకున్నారు. ఇందుకూరుపేట మండలం గంగపట్నం పల్లిపాళెం గ్రామానికి చెందిన పొనవాడ రమేష్‌బాబు ఇటీవల రైలు ప్రమాదంలో తన రెండు కాళ్ళు కోల్పోవడం, పిల్లలను చదివించే ఆర్థిక స్తోమత లేదని కన్నీళ్లు పెట్టుకోవడంతో చలించిపోయిన ఎంపీ వేమిరెడ్డి, తమ విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఆ దివ్యాంగునికి ఆమేరకు సాయం అందించారు.



చెన్నై నగరంలోని కళాసుధ సాంస్కృతిక సంస్థ రజతోత్సవ వేడుకతో పాటు కృష్ణాష్టమి వేడుకని ఆదివారంనాడు నిర్వహించారు. మద్రాసులోని మ్యూజిక్ అకాడమీలో జరిగిన ఈ కార్యక్రమంలో తమిళనాడులోని తెలుగు వారి పెద్ద దిక్కు డాక్టర్ సీ.ఎం.కే రెడ్డిని సత్కరించారు. ఈ సంబరంలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, ప్రముఖ నిర్మాత ఏ. యం. రత్నం, ఆంధ్ర క్లబ్ అధ్యక్షులు కొడవలూరు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామసభలు.. ప్రజా సమస్యల పరిష్కార వేదికలు

## - కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

రాష్ట్రప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న గ్రామసభల ద్వారా క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. కోవూరు పంచాయతీ కార్యాలయం వద్ద ఇటీవల నిర్వహించిన గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో పాలకులు విస్మరించిన ప్రజాస్వామిక సాంప్రదాయాన్ని తిరిగి కొనసాగించాలనే ఉద్దే శంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలకు శ్రీకారం చుట్టారన్నారు. స్థానిక సంస్థలను బలో పేతం చేస్తానన్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వం, చెప్పినమాట నిల బెట్టుకుంటూ రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వ హిస్తోందని ఆమె కొనియాడారు. గ్రామ స్థాయిలో అభివృద్ధికి పునాదులు పడితేనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి జరుగుతుం దన్నారు. అధికారులకు ప్రజలకు మధ్య వారధిగా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్డిఏ కూటమి పాలనలో గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాకారమవుతుందన్నారు. గ్రామ సభల ద్వారా స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్‌లకు ఆమె ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వివిధ సమస్యలపై స్థానికుల నుంచి



విజ్ఞప్తులు స్వీకరించారు. జిల్లా పంచాయతి అధికారి సుస్మితా రెడ్డి, కోవూరు ఎంపీడీఓ శ్రీహరి, తహశీల్దారు నిత్యానందబాబా, ఎంపీపీ తుమ్మల పార్వతి, కోవూరు సర్పంచ్ యాకసిరి విజయ, ఎంపీటీసీ నాగరాజు, టీడీపీ మండల అధ్యక్షులు మల్లారెడ్డి, లేగుంటపాడు సర్పంచ్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## మహిళలను లక్షాధికారులు చేయడమే..

# ప్రధాని మోడీ లక్ష్యం

## - డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ సాంబశివారెడ్డి



దేశంలోని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది, వారు లక్షాధికారులయ్యేలా చూడాలన్న ప్రధాన ధ్యేయంతో ప్రధాని మోడీ కృషిచేస్తున్నారు. 'లక్‌పతి దీదీ' పథకం ద్వారా ఆ మేరకు లక్ష్యాలను సాధించేందుకు సమాయత్తమయ్యారు. ఈనెల 25వ తేది మహారాష్ట్రలోని జలగావ్‌లో నిర్వహించిన 'లక్‌పతి దీదీ సమ్మేళన్' కార్యక్రమంలో దేశంలోని స్వయం సహాయక సంఘాల మహిళలనుద్దేశించి ప్రధాని మోడీ వర్చువల్‌గా మాట్లాడారు. దేశంలోని మూడుకోట్ల మంది మహిళలను లక్షాధికారులుగా తయారు చేయడమే సంకల్పంగా లక్‌పతి దీదీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. భారతదేశం గర్వించేలా నారీశక్తి ఆర్థిక పరిపుష్టికి అనేక సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తున్నట్లు తన సందేశంలో ప్రధానమంత్రి వివరించారు. మహిళలందరూ ఈ పథకాలను సద్వినియోగం చేసుకొని స్వయంసమృద్ధి సాధించాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుండి డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ సాంబశివారెడ్డి, స్వయం సహాయక సంఘాల మహిళలు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంబశివారెడ్డి మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా ఉన్న పొదుపు సంఘాల్లోని 1.20లక్షల మంది మహిళలను గుర్తించి, వారికి అవసరమైన జీవనోపాధులను కల్పించి లక్షాధికారులను చేయాలనే లక్ష్యంతో ప్రణాళిక రూపొందించి నట్లు చెప్పారు. అనంతరం జిల్లాలోని పొదుపు సంఘాల మహిళలకు ప్రశంసాపత్రాలను, 869 స్వయం సహాయక సంఘాలకు 105.75 కోట్ల లక్‌పతి దీదీ బ్యాంకు రుణాల చెక్కు, ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల ద్వారా రూ. 7కోట్ల ఉన్నతి రుణాలు, స్త్రీ నిధి ద్వారా రూ. 50 కోట్లకు సంబంధించిన బ్యాంకు చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

# వెంకటాచలం వద్ద.. 'నగర వనం'

దాదాపు 5కోట్ల రూపాయల వ్యయంతో సర్వేపల్లి నియోజక వర్గంలోని వెంకటాచలం సమీపంలో అత్యద్భుతమైన రీతిలో 'నగర వనం' రూపొందించేందుకు సంబంధిత అధికారులు భారీ సన్నాహాల్లో ఉన్నారు. ఈ నగర వనం ప్రాజెక్టులో రెస్టారెంట్, చిల్డ్రన్స్ పార్కు, విశాలమైన పార్కింగ్, అడ్వెంచర్ గేమ్స్, యోగా సెంటర్, థీమ్ బేస్డ్ ప్లాంటేషన్, ఆర్టిఫిషియల్ వాటర్‌ఫాల్స్, బోట్‌క్లబ్, ఓపెన్ జిమ్, మినరల్ వాటర్‌ప్లాంట్ తదితర సౌకర్యాలు కల్పించబోతున్నారు. ఈ నగర వనం ఏర్పాటుకు, ప్రభుత్వం ఇప్పటికే మంజూరు చేసిన రూ. 2 కోట్లు, సీఎస్ఆర్ నిధుల నుంచి రూ. 1 కోటి మంజూరు చేయించడంతో పాటు వివిధ మార్గాల్లో నిధులు సమకూర్చేందుకు కృషిచేస్తామని సర్వేపల్లి ఎమ్మెల్యే, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఇటీవల ఆయన నగర వనం ప్రాంతాన్ని సందర్శించి, అధికారులతో



సమీక్షించారు. మరో 10రోజుల్లో పలువురు మంత్రులతో పాటు ఉన్నతాధికారులతో మరోసారి నగరవనాన్ని సందర్శించి అవసర మైన వసతుల కల్పనతో పాటు నిధుల సమీకరణపై సమీక్షిస్తా మని కూడా ఆయన చెప్పారు. జిల్లా అటవీశాఖ అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.




# ఆసక్తికరంగా..అంతరిక్ష విశేషాల చిత్రప్రదర్శన

జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో, నెల్లూరులోని భారత ప్రభుత్వ క్షేత్రప్రచార శాఖ అధికారి పరవస్తు నాగసాయి సూరి సారధ్యంలో గూడూరులోని దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాలలో అంతరిక్ష విశేషాల చిత్ర ప్రదర్శన (ఫోటో ఎగ్జిబిషన్) మూడు రోజుల పాటు ఆసక్తికరంగా సాగింది. ఆగస్టు 23న గూడూరు శాసన సభ్యులు డా. పాశిం సునీల్‌కుమార్ చేతుల మీదుగా ప్రారంభమైన ఈ ప్రదర్శనను గూడూరులోని 50కి పైగా పాఠశాలలు, కళాశాలలకు చెందిన 10వేల మందికి పైగా విద్యార్థులు తిలకించారు. విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులందజేశారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన 'అంతరిక్షంలో మోడీ'తో సెల్ఫీ కౌంటర్ విద్యార్థులను విశేషంగా ఆకర్షించింది. రెండోరోజు కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన అంతరిక్ష వారోత్సవాల అవగాహన ర్యాలీ ప్రత్యేకంగా ఆకట్టుకుంది. శాస్త్రవేత్తల ఛాయా చిత్రాలతో సాగిన ర్యాలీ.. భారతదేశ విజయాన్ని కళ్ళకు కట్టింది.



## పర్యావరణాన్ని కాపాడుకోవాలి - నాగసాయి సూరి

చంద్రయాన్-3 విజయం ప్రతి భారతీయుడు గర్వించవలసిన అంశమని, అదే సమయంలో భూమి మీద పర్యావరణాన్ని కూడా కాపాడుకోవలసిన అవసరం ఉందని పరవస్తు నాగసాయి సూరి విద్యార్థులకు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోడీ సూచించిన 'అమ్మ పేరిట ఒక మొక్క' కార్యక్రమాన్ని చేపట్టారు. చివరి రోజున కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు మొక్కలు నాటారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# సమస్యల పరిష్కారానికి చర్యలు

**ఎమ్మెల్యే సునీల్‌కుమార్**



నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈ నెల 26న నియోజకవర్గంలోని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని పలువురు కళాకారులు ఎమ్మెల్యేని కలిశారు.






# ఘనంగా కృష్ణాష్టమి

గూడూరు డిఎన్ఆర్ కమ్యూనిటీ హాలులో ఈ నెల 24న విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు పాఠశాలల విద్యార్థులు శ్రీకృష్ణుడు, బలరాముడు, గోపికలుగా వేషధారణ వేసి, నృత్యాలు చేశారు. కృష్ణుడు వేషధారణలో జీవీఎస్ స్కూలుకు చెందిన జయదేవరామ్



ప్రథమ బహుమతి పొందాడు. విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు మల్లెమాల మురళీరెడ్డి, రమణయ్య, కడివేటి రామమూర్తి, ఆర్.రవిచంద్ర, భరణికృష్ణ, డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, ప్రభు, డాక్టర్ శివ, 'లాయర్' పత్రిక గూడూరు ఇన్‌ఛార్జి, గూడూరు బ్రాహ్మణ సేవా సంఘం ఉపాధ్యక్షులు ఆనిమెళ్ళ శివ కుమార్ పిల్లలకు బహుమతులందజేశారు.

# సామూహిక సీమంతాలు



మహిళలకు తల్లి కావడం ఒక వరమని సునీతా సేవాసంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి తెలిపారు. గూడూరు రాజావీధిలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో సేవాసంస్థ 24వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 27న గర్భిణులకు సామూహిక సీమంతాలను నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రాజేశ్వరి, ప్రముఖ వైద్యురాలు కీర్తి, షేక్ మెహబూబి, సునీతా సేవాసంస్థ అధ్యక్షులు సారంగం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# భద్రతా లోపాలే.. పరిశ్రమలకి శాపాలు!



అనకాపల్లి సమీపంలోని అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిలోని ఎసెన్షియా పరిశ్రమలో ఇటీవల పేలుడు జరిగి 17 మంది చనిపోవడం మన వ్యవస్థలోని డొల్లతనాన్ని మరోసారి బయటపెట్టింది. ప్రాణం ఎంతో విలువైనది. ఈ మాట చాలా సందర్భాల్లో, చాలా మంది అంటుంటారు. అది వినీ వినీ యథాలాపంగా అనిపించవచ్చేమో కానీ చెవులతో కాకుండా మనసు పెట్టి వింటే దాని విలువ తెలుస్తుంది. సంపాదించే మనిషి అర్ధంతరంగా మరణిస్తే ఆ కుటుంబం పరిస్థితి అల్లకల్లోలమవుతుంది. ఆర్థికంగానే కాదు.. అనుబంధాలపరంగానూ ఎంతో నష్టపోతారు. ఆర్థికంగా పరిహారం అందించినా దాన్ని నిలబెట్టుకునే ప్రణాళిక, సన్నద్ధత ఆ కుటుంబం వద్ద ఉండకపోవచ్చు. ఎందుకంటే, సాధారణంగా సగటు భారతీయ కుటుంబాల్లో సంపాదనపరుడైన కుటుంబ పెద్దే భవిష్యత్తు ప్రణాళిక బాధ్యతలను కూడా మోస్తుంటాడు. మిగిలిన వారు మిగిలిన పనులను పంచుకుంటారే తప్ప ఆర్థిక ప్రణాళికలపై అంతగా పట్టు ఉండదు. ఇది వాస్తవం.

ఎసెన్షియా ప్రమాదం జరిగిన రోజే, అదే ఆర్థిక మండలిలో మరో రసాయన పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగి 10 మంది గాయపడ్డారు. గత ఏడాది జూన్ 30న ఇదే ఆర్థిక మండలిలో ఓ ఫార్మా కర్మాగారంలో భారీపేలుడు జరిగి కొన్ని ప్రాణాలు పోయాయి. కొంతమంది గాయపడ్డారు. ఈ ఆర్థిక మండలిలో వందకు పైగా కర్మాగారాలున్నాయి. ఈ నెల 23న అనకాపల్లి జిల్లాలోనే జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలోని సినర్జిన్ కంపెనీలో ప్రమాదం జరగ్గా ముగ్గురు మరణించారు. 2020లో విశాఖపట్నం శివార్లలోని వెంకటాపురంలో ఉన్న ఎల్జీ పాలిమర్స్‌లో స్టైరీన్ మోనోమర్ వాయువు లీకై 12 మంది చనిపోయారు. ఇలా ప్రతి ఏటా ఏదో ఒక ప్రమాదం జరగడం, కార్మికులు, లేదా ఉద్యోగుల ప్రాణాలు పోవడం జరుగుతున్నా పటిష్టమైన భద్రతా వ్యవస్థ లేకపోవడం కచ్చితంగా ఒక పెద్ద లోపమే. మానవహక్కులు, రాజ్యాంగం ప్రసాదించిన జీవించే హక్కును ఉల్లంఘించడమే.

## నిషేధిత రసాయనాల ఉత్పత్తి ప్రమాదకరం :

ఎసెన్షియా పరిశ్రమలోని ప్రమాదాన్ని పరిశీలిస్తే ఎన్నో లోపాలు కనిపిస్తున్నాయి. ఈ పరిశ్రమకు జవాబుదారీ వహించే వ్యక్తే లేకపోవడం మరో పెద్ద లోపం. ఈ పరిశ్రమ కొంతమంది వ్యక్తుల భాగస్వామ్య సంస్థ. అందులో ఇద్దరు వ్యక్తుల మధ్య భేదాభిప్రాయాలు ఉన్నాయి. ఆ పంచాయితీ నిమిత్తం నేతల వద్దకు కూడా వెళ్లారని తెలుస్తోంది. ప్రమాదం జరిగిన రోజు ఆ యజమానుల్లో ఒక్కరు కూడా అక్కడకు రాలేదు. ఈ విషయాన్ని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రస్తావించి ఆగ్రహం వ్యక్తం చేశారు కూడా. అందులోనూ, ఈ పరిశ్రమలో అత్యంత ప్రమాదకరమైన, బాగా మండే స్వభావం, పేలుడును కలిగించే గుణం ఉన్న ఎంటీబీఈ అనే సాల్వెంట్ పెద్దఎత్తున నిల్వ ఉంది. ఆ రసాయనం లీకైందని, దానిని ఆపడానికి సిబ్బంది ప్రయత్నించారని, దానిని పూర్తిగా ఆపడానికి ముందే విద్యుత్తు ప్యానెల్‌పై పడి మంటలు అంటుకుని పేలుడు సంభవించిందని హోంమంత్రి అనిత చెప్పారు.

ఎంటీబీఈని ప్రధానంగా చమురు రంగంలో వినియోగిస్తారు. అది పెట్రోల్‌లో కలపడం వల్ల పెట్రోల్ సామర్థ్యం పెరుగుతుంది. ఈ ప్రయోజనం కన్నా, దాని వల్ల కలిగే దుష్ఫలితాలు ఎక్కువ కావడం వల్ల అమెరికా, కెనడా, జపాన్, ఐరోపాలోని కొన్ని దేశాల్లో దాని తయారీతో పాటు వినియోగాన్ని కూడా నిషేధించారు. పెట్రోల్‌లో కలపడానికి ఇథనాల్‌ను వినియోగిస్తున్నారు. ఇటీవల కాలంలో మన దేశంలో కూడా ఇథనాల్‌ను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. భూగర్భ ట్యాంకుల్లో నిల్వ ఉంచినప్పుడు ఎంటీబీఈ చాలా సులువుగా భూగర్భ జలాల్లో కలిసిపోయిన నీటిని కలుషితం చేస్తోంది. పైగా, బాగా మండే స్వభావం ఉంది. ఈ కారణంగా అభివృద్ధి చెందిన దేశాల్లో దాన్ని నిషేధించారు. అక్కడ నిషేధించిన రసాయనాన్ని మన దేశంలో ఇంకా తయారు చేయడం సమంజసం అనిపించడం లేదు. ఈ ఒక్క రసాయనమే కాదు.. విదేశాల్లో నిషేధిత జాబితాలో ఉన్న చాలా ఔషధాలను ఇక్కడ తయారు చేస్తూ విక్రయిస్తున్నారు. ఇది మనుషుల ప్రాణాలతో చెలగాటమాడడమే తప్ప మరొకటి కాదు.

## తనిఖీల నుంచి మినహాయింపు అసమంజసం

వ్యవస్థలోని మరో ముఖ్యమైన లోపం ఏమిటంటే, ప్రత్యేక ఆర్థికమండళ్లలోని అత్యంత రిస్క్ ఉండే పరిశ్రమలకు ప్రభుత్వ ప్రత్యక్ష తనిఖీలనుంచి మినహాయింపునివ్వడం. తనిఖీల పేరిట ప్రభుత్వ సిబ్బంది, అధికారులు ఏవో సాకులు చెప్పి డబ్బులు డిమాండ్ చేయడం, ప్రక్రియకు ఆటంకం కలిగించడం వంటి అంతరాయాలకు.. పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం చూపించిన పరిష్కారమిది. కానీ ఆన్‌లైన్లో తనిఖీలు చేపట్టాల్సి ఉంటుంది. ఇక మీడియం రిస్క్ ఉన్న పరిశ్రమలయితే థర్డ్ పార్టీ తనిఖీల ఆధారంగా స్వీయ ధ్రువీకరణ చేసుకోవచ్చు. అత్యంత హాస్యాస్పదమయిన మినహాయింపులివి. ఎటువంటి భద్రతా లోపాలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత కచ్చితంగా పరిశ్రమలదే. అదే సమయంలో, పరిశ్రమలు లోపరహితంగా ఉన్నప్పుడు తనిఖీలకు భయపడాల్సిన అవసరం ఏముంటుంది? తాము కచ్చితంగా ఉన్నప్పుడు, వేధించే ప్రభుత్వ సిబ్బంది తీరును నేరుగా బయటపెట్టి చట్టపరమైన చర్యలను డిమాండ్ చేయవచ్చు. ప్రభుత్వం కూడా అటువంటి అవినీతిపరులైన సిబ్బంది, అధికారులపై కఠినచర్యలు తీసుకుంటుంటే నిజాయతీగా పరిశ్రమలను నడిపే వారి జోలికి వెళ్లడానికి భయపడతారు. కానీ ప్రభుత్వం ఇచ్చిన వెసులుబాటును దుర్వినియోగం చేసే పరిశ్రమలపై చర్యలు తీసుకునే అవకాశం లేకుండా చేయడం సరైన పద్ధతి కాదు.

## పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు అవసరం

"ప్రామాణిక నిర్వహణ ప్రక్రియను ఎసెన్షియా కంపెనీ అనుసరించలేదని తేలింది" అని ప్రమాదం జరిగిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. ప్రమాదం జరిగిన తర్వాత లోపాలను కనుక్కుంటే ప్రయోజనం ఏముంటుంది? లోపాలు లేకుండా పరిశ్రమలు పకడ్బందీగా వ్యవహరించాలి. ప్రభుత్వం తనిఖీలు చేపట్టాలి. ఇదొక్కటే పరిష్కారం. అగ్ని ప్రమాదం మాత్రమే జరిగితే ప్రాణనష్టం జరగకుండా తప్పించడానికి ఎంతో కొంత ఆస్కారం ఉంటుంది. పేలుడు సంభవిస్తే లిప్తపాటులో సర్వం భస్మీపటలమవుతుంది. పేలుడు జరిగే అవకాశమున్న పరిశ్రమల్లో పేలుడు జరగకుండా అత్యంత పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేసుకోవడం అవసరం. సంబంధిత ప్రామాణిక నిర్వహణ ప్రక్రియను తూచా తప్పకుండా పాటించడమే అందుకు ఏకైక మార్గం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఆర్థిక మండళ్ల నిర్వహణ ప్రక్రియను సత్వరమే సమీక్షించి ఉద్యోగులు, కార్మికులు..చుట్టుపక్కల నివాసముండే ప్రజల ప్రయోజనాలు పరిరక్షించే సంస్కరణలు చేపట్టాలి. ఆర్థిక మండళ్లలో లేని సాధారణ పారిశ్రామికవాడల్లోనూ నిజాయతీగా తనిఖీలు చేపట్టే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలి. అప్పుడే ఇలాంటి ప్రమాదాలను నివారించేందుకు అవకాశం ఉంటుంది.



తుమ్మల బాల గంగాధర్ తిలక్




అమ్మ కౌసల్యకున్న ఆర్థిక బలం వలన మన తల్లి సుమిత్రకు కూడా వచ్చిన లోటు లేదు!.

అన్నా నేను నీ అనుచరుడను! నీ వెంటే నేనుంటా! నాకు తెలిసింది అదే! నీవిక అడ్డు చెప్పక అనుమతించు.

ధనుర్బాణాలు, గునపం, గంప చేతపుచ్చుకొని నీకు మార్గం చూపుతూ నీముందు నడుస్తాను.

నీకు నిత్యం కందమూలఫలములు, ఇతరావసరములు సేకరించి నీకు సమకూర్చగలవాడను!

తమ్ముడి ప్రేమకు తలవంచాడు అగ్రజుడు. సరే నీ మిత్రులవద్ద సెలవు తీసుకొనిరా అని పంపించాడు!.

లక్ష్మణా! నీవు సుయజ్ఞుల వారింటికి వెళ్ళి వారిని సగౌరవంగా ఇచ్చటికి తీసుకొనిరా!

వశిష్ఠుల వారింట్లో మామగారిచ్చిన రెండు దివ్యధనువులు, రెండు దివ్యఖడ్గములు, అక్షయ తూణీరములున్నాయి. అవి తీసుకొనిరా!

అన్న ఆజ్ఞను పాటించి అవి తీసుకొని వచ్చాడు లక్ష్మణుడు.

తమ్ముడూ నా సంపదలన్నీ బ్రాహ్మణులకు దానం చేయవలెనని నాకోరిక, కావున వేగమే వారిని తీసుకొనిరా అని పలికాడు.

వశిష్ఠుల వారి పుత్రుడు సుయజ్ఞుడు రామమందిరానికి లక్ష్మణునితో కలసి ఏతెంచాడు, ఆయనకు రాముడు తనవద్ద ఉన్న విలువైన ఆభరణాలు, ఇతర సంపదలు, శత్రుంజయము అనే ఏనుగును ఇవ్వగా, ఆయన భార్యకు సీతమ్మ తన హారాన్ని, వడ్డాణము బహూకరించింది!

వచ్చిన బ్రాహ్మణులందరికీ ఘనంగా దానాలు చేశాడు రామచంద్రుడు!

చిత్రరథుడు అనే రథసారథికి అమూల్యమైన రత్నాలు, చిన్న పశువులు, వేయిగోవులు ఇచ్చాడు.

అలా తన వద్దనున్న అందరికీ, అందరు పనివారికీ ఎల్లరూ సంతోషపడేటట్లుగా తన సమస్తసంపదలు దానం చేశాడు రాముడు.

ఇలా రాముడు తన సంపదలన్నీ దానం చేసిన తరువాత ఆయన మందిరంలోకి ఎముకలప్రోవులాగా బక్కపలుచగా ఉండి అపూర్వమైన తేజస్సుతో కనపడుతున్న ఒక ఆకారం నడుచుకుంటూ వచ్చింది ఆచ్ఛాదనగా అంగవస్త్రం మాత్రమే ఉంది.

రాముడు దానాలిస్తున్నాడని తెలిసి అతని భార్య పంపగా ఆశతో వచ్చాడు. ఆయన ప్రస్తుతం గునపం, తట్ట పట్టుకొని కందమూలఫలములు ఏరుకుంటూ జీవిస్తున్నాడు! రాముడి వద్దనుండి దానం పుచ్చుకుంటే దరిద్రం తీరుతుందనే గంపెడాశతో వచ్చాడు!

ఆయన పేరు త్రిజటుడు!

ఆయన రాముని వద్దకు వచ్చి రామచంద్రా పిల్లలుగలవాడను వారిపోషణ భారంగా ఉంది, నీవిచ్చే దానం స్వీకరించాలనే పెనుకోరికతో వచ్చానయ్యా!

అతనిని చూడగనే రామునికెందుకో పరిహాసం జనించింది!

పరిహాసిస్తూ నీ చేతిలోని దండం నీవెంతదూరం విసరెదవో అంత పొడవునా ఉండే సహస్ర గోసముదాయములు నీకు ఇచ్చెదను అన్నాడు. (స్వామికి కూడా పరిహాసం పుట్టించేటంత బలహీనంగా ఉన్నాడాయన).

ఆ త్రిజటుడు సంతోషించి చేతిలోని దండాన్ని బలంకొద్దీ విసిరాడు ఆ దండం సరయూ నదిని దాటి వేలకొలదీ ఆవులున్న మందలు ఆబోతుల మధ్యలో పడింది.

రాముడు వెంటనే ఆ వృద్ధబ్రాహ్మణునుని కౌగలించుకొని ఆయనకు ఇచ్చిన మాట ప్రకారంగా అన్ని గోవులనూ గోపాలకులతో సహా ఇచ్చివేసి ఆయనను బ్రతిమాలుకున్నాడు

మహాత్మా నన్ను క్షమించవయ్యా, నిన్ను పరిహసించాను, నా మీద కోపించకయ్యా! నీవు.

నీ తేజస్సు తెలుసుకోవాలనే అలాగ చేశాను. నీకు ఇంకా ఏ కోరిక ఉన్నా చెప్పు నేను తీరుస్తాను అని వినయంగా వేడుకున్నాడు.

రామా ! దయాసముద్రా! అమృతహృదయా! నాకింతకన్నా వేరే ఏమీ అవసరం లేదయ్యా! నీ యశస్సు దశదిశలు వ్యాపించుగాక, నీ బలం, ఆనందం వృద్ధిపొందుగాక అని ఆశీర్వదించి సంతోషంగా ఇంటికి తిరిగి వెళ్ళాడు..

రాజు పెద్దకొడుకును అడవికి వెళ్లమన్నాడట! చిన్న భార్య మీది మోజుతో ఈ దారుణానికి ఒడిగట్టాడట! ఎంత నిర్దయుడీ రాజు! ఎంత తెలివిమాలినవాడీయన!.



రాముడిని అరణ్యాలకు పంపాలన్న కైక కుతంత్రం, దశరథుడి ఆజ్ఞ దావానలంలా వ్యాపించింది నగరమంతా!

ఎవరికి వారు తమకే అన్యాయం జరుగుతున్నట్లుగా భావించారు!

కొడుకు గుణవంతుడు కాకపోయినా సరే! వాడు కళ్ళెదురుగుండా ఉంటే చాలని సర్దుకుపోతారే లోకంలోని తల్లితండ్రులు!

మరి దశరథుడికి ఏమయ్యింది! సకలగుణాభిరాముడు, మర్యాదా పురుషోత్తముడు, సాక్షాత్తూ ధర్మస్వరూపుడు, దయార్ద్రహృదయుడయిన రాముని అడవులకు పంపటమా?

జనుల ఆలోచనలు అలా సాగుతుండగనే... కదిలాడు కోదండపాణి భార్యాసమేతుడై, తమ్ముడు ముందు నడుస్తుండగా తండ్రికి మరొక్కమారు చెప్పి వెళదామని పాదచారియై తన భవనం నుండి బయల్దేరాడు.

అయోధ్యా నగరమంతా సౌధాగ్రాలమీదనే ఉంది! ప్రజలందరూ వీధులలోకి చేరారు! ఇసుకవేస్తే రాలటంలేదు!

అందరి కన్నులు ధారాపాతంగా వర్షిస్తున్నాయి. జనం జనం జనం. ఎటు చూసినా జనమే – వారి రోదనమే! అందరి చూపులూ సీతారామ లక్ష్మణులున్నవైపే.

కదిలితే సేవకులు, మెదిలితే పరిచారకులు, నగరంలో నడవటమంటే ఏమో తెలియదు!

సకల రాజలాంఛనాలతో వెడలే రాజకుమారుడు, సుకుమారుడు నేడు కాలినడకన ఒంటరియై తండ్రి గృహానికి బయలుదేరాడు!

సీతమ్మ అంటే అలా ఉంటుంది! ఇలా ఉంటుంది అని కథలు కథలు చెప్పుకోవటమే కానీ ఎవరూ ఎన్నడూ చూడలేదు. .. (సశేషం)

# మానవీయ విలువలు చాటిన
# డాక్టర్ రమేష్ పేరంశెట్టి దుర్మరణం!

## ○ ప్రమాదవశాత్తు తన ప్రాణాన్ని తానే తీసుకున్న యువ వైద్యుడు ○ అనితరసాధ్యం ఆయన ప్రస్థానం!

***ఓ** మానవతావాది బలీయమైన విధికి బలయ్యాడు. ఓ సేవాతపస్వి తన మరణానికి తానే కారకుడై కన్నుమూశాడు. ఓ స్నేహాభిలాషి తన స్నేహితులకి పెను విషాదాన్ని మిగిల్చి అనంత లోకాలకి వెళ్ళిపోయాడు. ఈ ఆధునిక యుగంలో సైతం నలుగురు బిడ్డలకి నాన్నగా, కుటుంబ వ్యవస్థని అమితంగా గౌరవించే వ్యక్తిగా.. ఆ ఇంటి పెద్దదిక్కు ఒక్కసారిగా తన కుటుంబాన్ని దిక్కులేనిదిగా చేసి.. అకస్మాత్తుగా అసువులు బాశాడు.*

*అమెరికా దేశం అలబామా రాష్ట్రంలో పేరుమోసిన ప్రఖ్యాత వైద్యుడు, నిస్వార్థ సేవకుడు, మన నెల్లూరీయుడు, నాయుడుపేట ప్రాంతంలోని మేనకూరు వాస్తవ్యుడు డాక్టర్ రమేష్ పేరంశెట్టి తన 63వ ఏట ఆగస్టు 23వతేదీ అమెరికా కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో తుదిశ్వాస విడిచాడు. తన సొంత తుపాకీని తానే తుడుచుకుంటున్న సమయంలో దురదృష్టవశాత్తు అకస్మాత్తుగా అది పేలి, దాని తూటా గుండెల్లోకి దూసుకుపోవడంతో అక్కడికక్కడే తన ఇంట్లోనే ఆయన ప్రాణాలు విడిచాడు. ఆయన రక్షణ కోసం పెట్టుకున్న ఆయుధమే ఆయన ప్రాణాలని భక్షించింది.*

1961 ఫిబ్రవరి 6వ తేదీ పేరంశెట్టి గురునాథం – రాజేశ్వరమ్మ దంపతులకు పెద్దకొడుకుగా ఆ కుటుంబంలో జన్మించాడు రమేష్.

ఎలిమెంటరీ స్కూల్ నుండి 10వ తరగతి వరకు తమ గ్రామం మేనకూరులోనే చదువుకున్నాడు. కావలి జవహర్ భారతిలో ఇంటర్ మీడియట్‌లో చేరాడు. ఇక్కడ కోర్శపాటి శ్రీధర్‌తో పాటు మరి కొంత మందితో రమేష్‌కి ఏర్పడ్డ స్నేహబంధం విడదీయలేని అనుబంధంగా మారి ఇప్పటికీ కొనసాగుతోందంటే అతిశయోక్తి కాదు.

జవహర్ భారతిలో ఇంటర్ పూర్తిచేసి, తిరుపతిలో ఎస్.వి.ఆర్ట్స్ కాలేజీలో బి.ఎస్సీ చేరారు. డిగ్రీ మూడవ ఏడాదిలో ఉన్నప్పుడు మెడికల్ సీటొచ్చింది. అదృష్టం కొద్దీ తిరుపతిలోని ఎస్.వి. మెడికల్ కాలేజీలోనే సీటు రావడంతో మెడిసిన్ చదువుతూనే బి.ఎస్సీ కూడా పూర్తి చేశాడు.

### అమెరికా వయా జమైకా!

మెడిసిన్ పూర్తి చేశాక 1989 అక్టోబర్‌లో జమైకాకి వెళ్ళారు డాక్టర్ రమేష్. జమైకాలో అడుగుపెట్టినప్పుడు ఆయన లక్ష్యం, ధ్యేయం, ఆశయం ఒక్కటే. తాను వైద్యుడిగా ఉన్నత శిఖరాలు అధిరోహించాలి.



తమ మిత్రుడు డాక్టర్ గుణ ముప్పూరి 1992లో జమైకాకి వచ్చిన సందర్భంలో తన మరో మిత్రుడు శ్రీధర్ కోర్శపాటితో డాక్టర్ రమేష్ (మధ్యలోని వ్యక్తి )

అదే లక్ష్యంతో, అదే ఆశయంతో, అదే ధ్యేయంతో శ్రమించడం ప్రారంభించారు. కష్టేఫలి అన్నట్లుగా "వెళ్ళిన కొన్ని నెలలకే డాక్టర్‌గా మంచి గుర్తింపుతో పాటు, అక్కడి ప్రభుత్వ పెద్దలలో పలుకుబడిని కూడా సంపాదించుకున్నాడు. జమైకాలో ఉన్న అవకాశాలన్నిటినీ క్షుణ్ణంగా పరిశీలించాడు. ఆ తరుణంలో రమేష్‌లో వచ్చిన ఆలోచనే తన స్నేహితులని కూడా జమైకాకి రప్పించింది. అలా జమైకా చేరిన వాళ్ళలో డాక్టర్ శ్రీధర్‌రెడ్డి కోర్శపాటి, డాక్టర్ గుణ ముప్పూరి, డాక్టర్ మురళి మండ్లూరు, డాక్టర్ సుమతి శేఖర్ పుట్టు, డాక్టర్ గోపీ ఏకొల్లు ఉన్నారు. జవహర్ భారతి నుండి తిరుపతి కాలేజీ దాకా సాగిన వారి స్నేహబంధం జమైకా, ఆ తరువాత అమెరికా వరకు విస్తరించింది.

### జమైకన్లకు అండగా...

జమైకన్ల సాంఘిక జీవనాన్ని, అక్కడి వైద్య విధానాన్ని, ప్రజల ఆరోగ్య విషయంలో ఉన్న వెనుకబాటుతనాన్ని రమేష్ బాగా అవగాహన చేసుకున్నారు. కేవలం వ్యాపారదృష్టితో కాకుండా సేవా దృక్పథంతో ఆ దేశానికి ఏదైనా చేయాలనుకున్నారు. డాక్టర్ గుణశేఖర్, డాక్టర్ శ్రీధర్‌రెడ్డిల భాగస్వామ్యంలో "ఇండీస్ ఫార్మా" అనే ఔషధ సంస్థను స్థాపించారు. వందకు పైగా జనరిక్ మందులను భారతదేశంలో తయారుచేయించి దిగుమతి చేసుకుని సబ్సిడీ ధరలకే, అంటే చౌకగా అక్కడ ప్రజలకు అందచేయగలిగారు.



### అమెరికా మజిలీ...

మూడు సంవత్సరాలు జమైకాలో ఉన్న తరువాత 1992లో జమైకా నుండి అమెరికాకి తన మకాం మార్చారు. 1995 డిసెంబర్‌లో డాక్టర్ శ్రీలత అన్నేను తన జీవితభాగస్వామిగా చేసుకున్నారు. 1996 అక్టోబర్‌లో కుమారుడు శశాంక్, 1998 ఆగస్టులో కుమార్తె నికిత, 2000 మేలో రెండవ కుమార్తె రోనిక, 2002 ఏప్రిల్‌లో రెండవ కుమారుడు రోహన్, అంటే మొత్తం నలుగురు పిల్లలు ఈ జంట ముద్దుల పంటగా ఆ ఇంట జన్మించారు.

### టస్కలుసా కేంద్రంగా తన ప్రస్థానం...

అలబామా రాష్ట్రంలోని టస్కలుసా నగరాన్ని తన హోమ్‌టౌన్‌గా చేసుకుని 1998 నుండీ అక్కడే స్థిరపడిపోయారు డాక్టర్ రమేష్ పేరంశెట్టి. ప్రస్తుతం టస్కలుసా వెయిట్‌లాస్ సెంటర్, ఫస్ట్ కేర్, క్రిమ్సన్ విలేజ్, క్రిమ్సన్ కేర్ సెంటర్లకు సిఇఓ మరియు మెడికల్ డైరెక్టర్‌గా తన వైద్య సేవలను కొనసాగిస్తున్నారు రమేష్.

### వృద్ధులకు ఆసరా...

ఏ ఆధారంలేని వృద్ధులు మరియు డిమెన్షియా బాధితులను దృష్టిలో ఉంచుకుని రిటైర్మెంట్ అసిస్టెడ్ లివింగ్ ఫెసిలిటీని, "క్రిమ్సన్ విలేజ్" పేరుతో స్థాపించి చరమాంకంలో ఉన్నవారి జీవితాలలో వెలుగులు నింపుతున్నారు ఈ కరుణామయుడు.

### భారతీయ యువత కోసం...

దేశం కానీ దేశం.. ఊరు కాని ఊరుకి వచ్చి అలబామా యూనివర్శిటీలో ప్రతి సంవత్సరం చేరే కొత్త విద్యార్థులను తరచూ పలకరిస్తుంటారు రమేష్. మీకేం కావాలన్నా ఎప్పుడైనా మా ఇంటి తలుపు తట్టండని చెప్పేవారు. ఒకప్పుడు నేనూ మీలాగా వచ్చిన వాడినే, బాగా కష్టపడితే మీరూ నాలాగా విజయం సాధిస్తారు అని వారిలో భరోసా కల్పించేవారు.



అలబామా రాష్ట్రంలోని "టస్కలూసా" నగరంలో ఇకపై మార్చి 28ని "డాక్టర్ రమేష్ పేరంశెట్టి రోజు"గా ప్రకటించిన నగర మేయర్ వాల్ట్ మెడాక్స్

### కన్నవారు.. ఊరి వారి కోసం...

తాను మేనకూరులో పుట్టాడు. అక్కడే ఓనమాలు నేర్చుకున్నాడు. అమ్మ అక్కడే ఉంది. మరి అక్కడివాళ్ళ కోసం తాను ఏదోఒకటి చెయ్యాలి కదా..! ఈ ఆలోచన వచ్చిన వెంటనే కొంతమంది తన చిన్ననాటి మిత్రులని, క్లాస్‌మేట్స్‌ని కలుపుకుని నెల్లూరులో 'సింహపురి హాస్పిటల్' (ఇప్పుడు మెడికవర్)ని ఏర్పాటుచేశారు. తన కన్నతల్లి దగ్గర నుండి తన వారెవరికైనా ఇది మా ఆసుపత్రి అన్న ధైర్యం, ఇక్కడ మనం భద్రంగా ఉంటామన్న భరోసా కల్పించడమే ప్రధానంగా ఈ ఆసుపత్రిలో తాను భాగం పంచుకున్నారు రమేష్.

### కోవిడ్ హీరో...

ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కోవిడ్ ఉధృతంగా ఉన్న సమయంలో రమేష్ ఒక డాక్టర్‌గానే కాకుండా బాధ్యత కలిగిన పౌరుడిగా చేసిన సేవలు విశేష ప్రశంసలు కురిపించాయి.

హడ్సన్ – పూల్ అనే ప్రఖ్యాత ఆభరణాల సంస్థ ఒక వజ్రానికి ఆయన పేరు పెట్టేంతగా, ప్రజలందరూ ఆయనని "డాక్టర్ కోవిడ్" అని పిలిచేంతగా మానవత్వాన్ని ప్రదర్శించి తన ఉనికిని చాటుకున్నారు. డాక్టర్ రమేష్‌గా కంటే 'డాక్టర్ పి'గా ఆయన ఖ్యాతి పొందారు.

### పురస్కారాలు - ప్రశంసలు...

విద్యార్థి దశ నుండే ఎన్నో పురస్కారాలు సత్కారాలు తన సొంతం చేసుకున్నారు డాక్టర్ రమేష్.

టస్కలుసా నగరపాలక బృందం ఒక వీధికి డాక్టర్ రమేష్ వీధిగా, ఒక కాలనీకి డాక్టర్ రమేష్ అవెన్యూగా పేరుపెట్టారంటే రమేష్ గుణగణాలని, ప్రతిభని ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. ఏడాదిలో ఒక రోజుని 'డాక్టర్ రమేష్ పేరంశెట్టి డే' అని పెట్టి రమేష్ జీవించివుండగానే ఆయన పేరుతో ఒక రోజును సెలవు దినంగా ప్రకటించారు. అంతటి స్థాయిలో సామాజిక సేవలో రమేష్ చురుకుగా పాల్గొనేవారు.

### స్వగ్రామంలో సేవా పరిమళాలు

డాక్టర్ రమేష్‌కి తాను పుట్టి పెరిగిన ఊరంటే మహా ఇష్టం. స్వగ్రామం మేనకూరు గ్రామంలో తవ్వకాలలో బయటపడిన అతిపురాతన "జనార్ధన స్వామి" విగ్రహాల స్థాపన కోసం తన సొంత ఖర్చులతో ఆలయాన్ని నిర్మించారు. కొత్త దేవుళ్ళ ఆలయంగా ఆ దేవాలయం ప్రసిద్ధి చెందింది. అలాగే, బడికి కావలసిన వసతులను సమకూర్చారు, తాగునీటి అవసరాలను తీర్చారు. బాగా చదువుకోవాలన్న తపన ఉండి ఆర్థిక స్తోమత లేనివారికి తాను అండగా ఉండి చదివిస్తున్నారు. చదువు పూర్తై ఉద్యోగవేటలో ఉంటే, వారికి కూడా తానే దిక్సూచిగా మారి బ్రతుకుబాటను చూపించారు.



చివరిసారిగా తన మిత్రుడు గుణతో కలిసి అమ్మకి ముద్దు పెడుతున్న డాక్టర్ రమేష్

తన మరణానికి సరిగ్గా వారం ముందు, తమ సమీపబంధువుల పెళ్లి వేడుకలో పాల్గొనడానికి రమేష్ భారతదేశానికి వచ్చారు. ఎప్పుడు ఇండియాకి వచ్చినా మిత్రులతో సగం రోజులు గడిపే రమేష్ ఈసారి తన సమయాన్నంతా తన అమ్మకోసమే కేటాయించాడు. ఉన్న కొద్ది రోజులూ ఆమెతోనే గడిపారు. తన ఆప్త మిత్రుడు డాక్టర్ గుణతో కలసి అమ్మకి ముద్దుపెట్టి అమెరికాకి బయలుదేరాడు. కానీ... అదే తన బిడ్డ తనకిచ్చిన చివరి ముద్దని ఆ తల్లికి తెలియదు. టస్కలుసాలోని తన ఇంటికి గురువారం చేరుకున్న రమేష్, ఇంటికి చేరుకున్న పక్కరోజే... అంటే శుక్రవారం మధ్యాహ్నం అనంతలోకాలకేగిపోయారు. అమెరికా కాలమాన ప్రకారం ఆగస్టు 29వ తేదీ ఆయన అంత్యక్రియలు జరిగాయి.

రమేష్ కుటుంబానికి, ఆయన మిత్రబృందానికి మనోస్థైర్యాన్ని కల్పించాలని భగవంతుని ప్రార్థిస్తూ... రమేష్ మృతికి శ్రద్ధాంజలి ఘటిస్తోంది 'లాయర్'.

# తెగులు పట్టిన తెలుగు..!



పమిడికాల్వ మధుసూదన్
9989090018

దక్షిణాది తమిళ, మలయాళ, కన్నడ, తెలుగు భాషల్లో అంతరించి పోయే ప్రమాదం ఎక్కువగా ఉన్నది మన తెలుగుకే. తెలుగు నామరూపాల్లే కుండా ఎప్పటికి పోతుంది అన్నది మన ప్రయత్నాలను బట్టి ఉంటుంది. ఇప్పటి మన సంకల్పం, పట్టుదల ప్రకారం చూస్తే- ఖచ్చితంగా ఇంకో రెండు వందల ఏళ్ళల్లో మొదట తెలుగు లిపి అదృశ్యం కావచ్చు. మాట్లాడే భాషగా తెలుగు ఇంకొంత ఎక్కువకాలం బతకవచ్చేమో కానీ- ఆ మాట్లాడే తెలుగులో తెలుగు పదిశాతం మిగిలి ఉంటే గొప్ప. ఇంకో అయిదు వందల సంవత్సరాల తరువాతి వారికి ఇప్పటి మన వాడుక తెలుగు శ్రీనాథుడి పద్యాల్లా ఎవరయినా విడమరచి చెబితే తప్ప అర్థం కాకపోవచ్చు.

కనీసం ఇంకో పది వేల సంవత్సరాలయినా బతికి, బట్ట కట్టి, బలు సాకయినా తిని, నిలబడగల కండపుష్టి, ఎముకల బలం తెలుగుకు ఉన్న మాట నిజమే అయినా-ఇప్పటి పరిస్థితులు మాత్రం అందుకు అనుగుణంగా లేవు. తెలుగు లిపి నెమ్మదిగా విలువ లేనిది అవుతుంది. తరువాత మాట కూడా విలువ లేనిదే అవుతుంది. ఖచ్చితంగా ఇదంతా ఎప్పటికి జరుగుతుంది? అని తేల్చడం ఈ వ్యాసం ఉద్దేశం కాదు. మహా అయితే ఇంగ్లీషు రాని తెలుగువారు మాత్రమే తెలుగు మాట్లాడుతుంటారు. భవిష్యత్తులో తెలుగు మాట్లాడేవారిని అనాగరికులుగా చూడరని భరోసా అయితే ఏమీ లేదు. ఇంతకంటే లోతుగా భాష కనుమరుగయ్యే ప్రమాదం గురించి మాట్లాడి ప్రయోజనం లేదు.

మన పొరుగున కర్ణాటక సముద్రతీరం మంగళూరు-ఉడిపి ప్రాంతాల్లో తుళు మాట్లాడతారు. తుళు ప్రత్యేక భాషే అయినా, కోటి మందికి పైగా తరతరాలుగా మాట్లాడుతున్నా ఇప్పుడు లిపి లేదు. కన్నడ లిపిలోనే తుళు భాషను రాయాలి. నిజానికి ఆరు వందల సంవత్సరాల క్రితం వరకు తుళుకు ప్రత్యేక లిపి ఉండేది. అనేక కారణాల వల్ల లిపి అంతరించి పోయింది. కృష్ణదేవరాయల మాతృభాష తుళు. తుళు తన సొంత లిపిని మరచిపోయి, కన్నడ లిపిలోకి కుంచించుకుపోయినట్లు- మన తెలుగు లిపి కూడా ఇంగ్లీషులోకి కుంచించుకుపోయి సొంత లిపిని పూర్తిగా మరచిపోయే రోజులు ఎంతో దూరంలో లేవు.

ఒక లిపి ఏర్పడడానికి వేల ఏళ్ల సమయం పడుతుంది. మొనదేలిన రాయి ప్రవాహంలో ఒరుసుకుని, ఒరుసుకుని నున్నగా, గుండ్రంగా తయారయినట్లు తెలుగు లిపి కూడా గుండ్రంగా, అందంగా ఏర్పడింది. నవ్వుతున్నట్లు 'అ'అక్షరం ఎంత అందంగా ఉంటుంది? పురి విప్పిన నెమలిలా 'ఖ'ఉంటుంది. కీర్తికి పెట్టిన కిరీటంలా 'గ' ఉంటుంది. బుగ్గన సొట్టలా 'ఠ' ఉంటుంది. రాయంచలా 'హ' ఉంటుంది. తెలుగు వర్ణమాల అచ్చులు, హల్లుల అందం, అవి ఏర్పడ్డ పద్ధతి మనకు పట్టని పెద్ద గ్రంథం. భాషకు శాశ్వతత్వం ఇచ్చేది, తరతరాలకు భాషను అందజేసేది లిపి. మాట్లాడే మొత్తం భాషకు ఒక్కోసారి లిపి చాలకపోవచ్చు. తెలుగులో దాదాపుగా మాట్లాడే భాషకు తగిన, బాగా దగ్గరయిన వర్ణమాల ఉంది. అంత నిర్దుష్టమయిన, నిర్దిష్టమయిన లిపి తెలుగుకు ఉంది. ముత్యాల్లాంటి, రత్నాల్లాంటి తెలుగు అక్షరాలు మనకెందుకో వికారంగా కనిపిస్తాయి. అసహ్యించుకోవాల్సినవిగా అనిపిస్తున్నాయి. వాడకూడనివిగా అనిపిస్తాయి.

తెలుగు భాష అవసరాలకే అయినా తెలుగు లిపిలో రాయడం తక్కువ తనంగా అనిపిస్తుంది. తెలుగుకు తెలుగు లిపే అంటరానిదిగా అవుతోంది. తెలుగును ఇప్పుడు ఇంగ్లీషులో రాయడం ఫ్యాషన్. మర్యాద. ట్రెండ్.

"బాగున్నారా? పది గంటలకే నిద్రలేచి అప్పుడే మెసేజులు చూస్తున్నారా?" అని తెలుగులో అఘోరించకూడదు.

దీన్ని...

"Bagunnara? Padi gantalake nidra lechi appude mesejulu chustunnara?"

అని ఇంగ్లీష్ లిపిలో రాస్తేనే ఆధునికులం. ట్రెండీ. కొత్తతరంతో మనం కూడా పరుగులు తీస్తున్నట్లు. ఇలా రాయడంవల్ల లండన్‌లో షేక్స్‌పియర్లు, అమెరికాలో నోమ్‌చామ్‌స్కీలు మన తెలుగును సులభంగా చదివి అర్థం చేసుకుంటున్నారేమో తెలియదు. తెలుగు లిపిని మాత్రం ఘోరంగా అవమానిస్తున్నారు. లిపిని రద్దు చేస్తూ దుర్మార్గమయిన పాపం మూటగట్టుకుంటున్నారు. మన నిలువెత్తు సంతకాన్ని మనది కాకుండా చేస్తున్నారు.

పలికే మాటను సంకేతించే అక్షరం పుట్టడానికి కొన్ని యుగాల సమయం పట్టింది. దాన్ని చెరిపేయడానికి పదేళ్ల సమయం సరిపోతుంది. ప్రత్యేకించి సినిమా పాటల లిరికల్ రిలీజ్‌లన్నీ ఇలా ఇంగ్లీషు లిపిలోనే జరగాలని తెలుగు సినీ పరిశ్రమ రాసుకున్న రాజ్యాంగం.

కోల్డ్ బ్లడెడ్ మర్డర్ అని ఇంగ్లీష్‌లో ఒక మాట ఉంది. రెండో కంటికి తెలియకుండా తడిగుడ్డతో గొంతు కోయడం. చుక్క రక్తం చిందకుండా గుండె కోయడం. అలా మనం తెలుగు లిపిని నిశ్శబ్దంగా హత్య చేస్తున్నాం. ఇన్నాళ్లు ఈ లిపి హత్యా నేరంలో తెలుగు సినీ పరిశ్రమ ఒకటే ఉండేది. ఇప్పుడు కార్పొరేట్ కంపెనీల ప్రకటనలు కూడా తోడయ్యాయి.

"The Bigbasket promise.
Prati Roju Takkuva Dharalaku"

లాంటివి ప్రతిరోజూ లెక్కలేనన్ని ప్రకటనలు.

ప్రతిరోజూ తక్కువ ధరలకు అని తెలుగులో రాస్తే జైల్లో పెడతారని భయపడి ఇంగ్లీషులో రాసినట్లున్నారు. ఇలా రాయడంవల్ల ఒకే సమయంలో నిరక్షర కుక్షులమయిన మనకు రెండు భాషలు నేర్పుతున్నామని వారు అనుకుంటూ ఉంటే... వారి పాదధూళి కోసం మనం ప్రయత్నించాల్సిందే.

మనకు మనమే చెరిపేసుకుంటున్న చరిత్ర మనది. మనకు మనమే అక్షరాన్ని బూడిద చేసుకుంటున్న పాపం మనది. మనకు మనమే నిరక్షరులుగా మిగిలే దైన్యం మనది. తెలుగు అక్షరం గుక్కపట్టి ఏడుస్తున్నా విని పించుకోని పుట్టుచెవుడు మనది. తెలుగు అక్షరం గుండెలు బాదుకుంటున్నా చూడలేని పుట్టు వైకల్యం మనది. తెలుగు పట్టని వైక్లబ్యం మనది.

ఎవ్వరూ భయపడకండి. తెలుగును నడి బజారులో పట్టపగలు అందరు చూస్తుండగా ఖూనీ చేసినా ఎవరూ కేసులు పెట్టరు. పెట్టినా నిలబడవు. నిలబడినా శిక్ష పడదు. పడినా అమలు కాదు.

త్వరగా పిడికిలి బిగించి ఉరికి రండి!
తలా ఒక పిడిబాకు చేతబట్టి ఉబికి రండి!
తెలుగును కసితీరా పొడిచి పొడిచి చంపేద్దాం.
తెలుగును తెలుగు లిపిలో రాస్తే- అమ్మ భాష.
తెలుగును ఇంగ్లీషు లిపిలో రాస్తే- Amma Mogudi Bhasha.

## తెలుగు అక్షరాలు సులభంగా నేర్చుకోవడానికి..

# 'కళాక్షరిక'




ఇంతటి నైరాశ్యంలో కూడా మెల లోతు కష్టాల్లో... వెలుకాటి లోతు ఆనందం అన్నట్లు.. కోటికొక్కరు తెలుగు అక్షరాలను పొదివి పట్టుకుని... ముందు తరాలకు అందించడానికి తెలుగు అక్షరాల అందాన్ని ఆవిష్కరించి కళ్లకు విందు చేయడానికి, పలికి చెవులకు పండగ చేయడానికి ప్రయత్నిస్తుంటారు.

అలా పుస్తకం తెరవగానే తెలుగు అక్షరాలు మన ముందుకు దూసుకు వచ్చినట్లు తెలుగు భాషాభిమాని శశి గూడూరు(98857 33717) ఒక "కళాక్షరిక" తయారు చేశారు. ఐఐటీ బాంబేలో దృశ్య సమాచార- విజువల్ కమ్యూనికేషన్స్‌లో పి.జి చేసిన శశి మనసంతా తెలుగే. తనకున్న సాంకేతిక పరిజ్ఞానంతో తెలుగు వర్ణమాల మీద చిన్న పిల్లలకు ఉత్సాహం కలిగేలా ఇదివరకే ఆయన ఎన్నో ప్రయోగాలు చేసి... పేరు తెచ్చుకున్నారు. "టైపోవనం" వ్యవస్థాపకుడిగా ఆయన తెలుగు భాషా పరిరక్షణ స్పృహ ఉన్న వర్గాలకు దగ్గరివారు. ఒకప్పుడు తెలుగు అక్షరాలను పలకల మీద దిద్దుకుంటూ నేర్చుకున్నాం. ఇప్పటికీ అదే అత్యుత్తమమైన పద్ధతి. ఇంత సాంకేతికత పెరిగిన రోజుల్లో అక్షరాలు దిద్దుకునే పద్ధతికి ప్రత్యామ్నాయం కనుక్కోవాలి- అన్న శశి ఆలోచనకు ఈ "కళాక్షరిక" ప్రతిరూపం. ఈ అక్షరాలను తాకవచ్చు. పదే పదే మూసి... తెరుస్తుంటే... ఆ అక్షరం పేజీలోనుండి సీతాకోకచిలుకలా మన కళ్లముందు ఎగురుతున్న అనుభూతి కలుగుతుంది. అక్షయమైన తెలుగు అక్షరం క్షయం కాకుండా ఉండడానికి ఉపయోగపడే మంచి ప్రయత్నం. తెలుగు భాషాభిమానులందరూ శశిని నిండు మనసుతో అభినందించాలి.

# ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు..దరఖాస్తులు పంపండి

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు-2024 సంవత్సరానికి సంబంధించిన ప్రతిపాదనలతో ఉపాధ్యాయులు తమ దరఖాస్తులను ఈనెల 31వ తేదీలోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పంపాలని డీఈఓ పీవీజే రామారావు ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తులను డిప్యూటీ ఇఓ, ఎంఇఓల ద్వారా పంపించాలని, పూర్తి వివరాలకు జిల్లా విద్యాశాఖ అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు.

## టూకీగా...



### సంగంలో గంగమ్మతల్లికి.. కుంకుమార్చన

శ్రావణమాసం సందర్భంగా మండల కేంద్రమైన సంగంలో ఈనెల 26న గంగమ్మతల్లి గుడిలో ఆలయ అర్చకులు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. మహిళా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు పర్యవేక్షించారు.

### వీరంపల్లిలో ఉచిత కంటివైద్య శిబిరం

మనుబోలు మండలం వీరంపల్లి పాఠశాలలో గూడూరు కేవీ హాస్పిటల్, హారిక కంటి వైద్యశాల వారు కలసి ఈనెల 25న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్లు నారా కీర్తి, రేజర్ల త్రివిక్రమరావు, మల్లెమాల హరికారెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొని చిన్నారులకు, మహిళలకు కంటిపరీక్షలు చేసి ఉచితంగా మందులిచ్చారు. టీడీపీ నాయకులు పి.ప్రసాద్, రఘు రామయ్య, శ్రీనివాసులురెడ్డి, వెంకటరమణయ్య పర్యవేక్షించారు.

### వెంకటాచలంలో.. గిరిజనులకు దుస్తులు పంపిణీ

మండల కేంద్రమైన వెంకటాచలంలో ఉన్న బేతేలు చర్చి ఆవరణలో ఈనెల 25న 'నైనా ఫౌండేషన్' వారు నిరుపేద గిరిజనులకు తమవంతు సాయంగా దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం పేదలకు అన్నదానం నిర్వహించారు. ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ ఎన్‌సి సుహాసిని, డాక్టర్ బెంజిమన్ ఐజక్, డాక్టర్ సొమన్ సాహిత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

### ఉదయగిరిలో దళితవాడ చిన్నారులకు పండ్లు పంపిణీ

ఉదయగిరిలోని దళితవాడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న దివ్యాంగ చిన్నారులకు రిటైర్డ్ హెడ్మాస్టర్ ఓబులేసు ఆధ్వర్యంలో ఈనెల24న పండ్లు, పలకలు, చాక్లెట్లు పంపిణీ చేశారు. పిల్లలంతా బాగా చదువుకోవాలని చెప్పారు. హెడ్మాస్టర్ షబ్బీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పొదలకూరులో శ్రీ వేంకటేశ్వరస్వామికి పల్లకిసేవ

పొదలకూరులోని అయ్యప్పనగర్‌లో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామికి ఆలయ అర్చకులు ఈనెల 24వ తేది రాత్రి వైభవంగా పల్లకిసేవ నిర్వహించారు అనంతరం, నక్షత్రహారతి, పంచహారతులు, వెంగమాంబాదేవి ముత్యాలహారతి వేడుకగా చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

### నాగరాజుతోపులో ఉచిత వైద్యశిబిరం

జగదేవిపేట మండలంలోని నాగరాజుతోపులో ఈనెల 24న వైద్యాధికారి బ్రహ్మేశ్వర్‌నాయుడు ఆధ్వర్యంలో 104 సంస్థ సారథ్యంలో ఉచితవైద్య శిబిరం నిర్వహించి రోగులకు వైద్యపరీక్షలు చేసి అవసరమైన మందులిచ్చారు. హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, సీహెచ్‌ఓ విద్యాసారిక, ఖాదర్‌బాషా, సుశీలమ్మ, లక్ష్మణ్, సుల్తాన్‌బాషా, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

### కలువాయిలో విద్యార్థులకు క్విజ్ పోటీలు

కలువాయిలోని బీవీఎస్ఆర్ జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థులకు ఈనెల 24న సాంఘికశాస్త్రంలో క్విజ్‌పోటీలు నిర్వహించారు. విజేతలైన సందీప్‌కుమార్, సాదిక్, త్రినేష్, రిత్విన్, జ్యోత్స్న, మేనక, రాజరాజేశ్వరి, ప్రవస్థి, శ్రీలత, నీహారిక, ఉష్టత్, సుప్రజలకు సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ సొంతనిధులతో, హెడ్మాస్టర్ అబ్బాస్ ఆలీ చేతులమీదుగా బహుమతులిచ్చారు.

### మాలకొండస్వామికి రూ.13.84 లక్షల ఆదాయం

ప్రసిద్ధ నారసింహక్షేత్రం..కందుకూరు నియోజకవర్గం వలేటివారిపాళెం మండలంలోని మాలకొండలో కొలువైవున్న శ్రీ లక్ష్మీనృసింహస్వామివారి దేవాలయానికి ఈనెల 24న శనివారం ఒక్కరోజునే వివిధ రూపాల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.13,84,259లు ఆదాయం వచ్చినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు తెలిపారు.

### పున్నూరులో వరిపొలాల సందర్శన

ఇందుకూరుపేట మండలంలోని పున్నూరులో సహాయ వ్యవసాయ సంచాలకులు ఏ.రాజ్‌కుమార్ వరి పొలాలను సందర్శించి వరికి నల్లిపురుగు ఆశిస్తోందని గుర్తించి, దాని నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు సూచించారు.

# 'ఏకలవ్య' పాఠశాలలో ఎంపీ వేమిరెడ్డి

## సమస్యలు తీర్చి, ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్న విపిఆర్



కోవూరు నియోజకవర్గం కొడవలూరు మండలం చంద్రశేఖరపురంలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (గిరిజన గురుకుల పాఠశాల) ఎంతో కాలంగా సమస్యలకు నిలయంగా ఉండడం పట్ల నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి(విపిఆర్) ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనాభివృద్ధి ధ్యేయంగా, ఉన్నతమైన ఆశయాలతో ప్రభుత్వం ఏకలవ్య పాఠశాలలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ పాఠశాలలో ఎంతోమంది విద్యార్థులు చదువుకుంటున్నారని, వారి సమస్యలన్నీ తీర్చి, ఈ పాఠశాలను ఆదర్శవంతమైన పాఠశాలగా రూపుదిద్దుతామని ఆయన ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

ఈనెల 28న ఆయన ఆ పాఠశాలను స్వయంగా సందర్శించి, అక్కడున్న సమస్యలను నేరుగా విద్యార్థులు, అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని అన్ని విభాగాలను ఆయన పరిశీలించారు. పాఠశాలలో తగినంతమంది సిబ్బంది లేకపోవడం చూసి, ఆ వివరాలు తీసుకున్నారు. ప్రతి తరగతి గదినీ పరిశీలించారు. వసతి గదులు, వంట గది అన్నిటి పరిస్థితినీ చూశారు. మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడం, విద్యార్థుల భోజనశాల ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోకపోవడం, అసంపూర్తగా ఆగిపోయిన స్టేడియం, బోధన, బోధనేతర సిబ్బంది కూడా తగినంతమంది లేకపోవడం వంటి సమస్యలన్నీ నేరుగా చూశారు. దాదాపు 20 ఎకరాల్లో ఈ పాఠశాల ఉన్నా, సరైన వసతులు లేకపోవడాన్ని గమనించారు. పాఠశాలలో ఉన్న సీసీ కెమెరాలు సరిగా పనిచేయకపోవడంపై ఆరా తీశారు. ఇక్కడ ఉన్న సిబ్బందిలో అనేకమంది హిందీ మాట్లాడేవారే ఉన్నారని, అందువల్ల వారు విద్యార్థులకు ఏం చెప్తున్నారో అర్థంకాక, అంతా అయోమయంలో ఉన్నారని ఆయన అంటూ, ఈ పాఠశాలలో తెలుగు తెలిసిన సిబ్బందిని నియమిస్తేనే విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుందన్నారు. భోజనశాలను త్వరలోనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర గిరిజనాభివృద్ధి శాఖ మంత్రి జుయల్ ఓరమ్ సూచనలతో తాను ఈ పాఠశాలను సందర్శించడం జరిగిందని, ఇక్కడున్న సమస్యలను విన్నవించి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. విద్యార్థులంతా బాగా చదువుకోవాలని ఆయన ఆకాంక్షించారు. సమస్యలని కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు గిరిజన సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ పరిమళ, తహశీల్దారు స్ఫూర్తి, పాఠశాల ప్రిన్సిపాల్ విశ్వప్రతాప్, టీడీపీ నాయకులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

● నెల్లూరు కార్పొరేషన్‌లో మరో గుట్టు రట్టయ్యింది

# షాపింగ్ కాంప్లెక్సలలో.. 'బినామీ దుకాణాలు'

**నెల్లూరు కార్పొరేషన్ అంటనే రకరకాల మాయాజాలాలకు పుట్టినిల్లు. అక్రమాలకు.. అవినీతికి కొంతమందికి ఇదో అడ్డా. ఎంతటి కఠినమైన..నిజాయితీ అధికారులొచ్చినా వారిని ఎలాగో దారిలోకి తెచ్చుకుని తమపని చేసుకోవడంలో ఆరితేరిన వారెందరో ఇక్కడ ఉంటారు. ఇటీవలే ఐఏఎస్ అధికారులైన కార్పొరేషన్ కమిషనర్ల సంతకాలనే దర్జాగా ఫోర్జరీ చేసేసి, అక్రమాలకు తెరతీసిన ఘనుల వ్యవహారం బయటపడిన విషయం తెలిసిందే. తాజాగా, నగరపాలక సంస్థ ఇచ్చిన దుకాణాలు తమ సొంత ఆస్తులైనట్లు ఇతరులకు కట్టబెట్టి, వారి నుంచి అధికమొత్తాలు వసూలు చేయడంలో ఘనాపాటీలుగా ఉన్న వారి వ్యవహారం వెలుగులోకి రావడం సంచలనంగా మారింది.**

నెల్లూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలోని షాపింగ్ కాంపెక్స్‌లలో ఎంతోకాలం నుంచి గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న బినామీల బాగోతం తాజాగా బట్టబయలైంది. ఈ షాపింగ్ కాంప్లెక్స్‌ల్లోని దుకాణాలను తమ వ్యాపారాలకు అడ్డాగా మార్చేసుకుని ఎవరిపాటికి వారు అక్రమంగా సొమ్ము చేసుకుంటుండడాన్ని అధికారులు గుర్తించారు. ఆ దుకాణాలు తొలుత వేలం ద్వారా ఒకరు దక్కించుకుంటారు.. కానీ ఆ తర్వాత అందులో వ్యాపారం చేసేవారు మరొకరుంటారు. దానిని తక్కువ అద్దెకు తీసుకుని, ఇంకొకరికి వాళ్లు మళ్ళీ రెండింతలు అద్దె పెంచేసి ఇస్తారు. అదంతా వారి ఆస్తే అయినట్లు వ్యవహరిస్తూ అవతలివారి నుంచి అడ్డగోలుగా ఇష్టానుసారం అద్దెలు వసూలు చేసుకుంటారు. కానీ, కార్పొరేషన్‌కు మాత్రం ఆ డబ్బులేమీ ఇవ్వరు. ఇప్పటినుంచి కాదు, ఎంతోకాలంగా ఈ దందా నడుస్తోందన్నది బహిరంగ రహస్యమే. కానీ, వాటిని పట్టించుకునేవారు కానీ, పట్టించుకున్నా తగు చర్యలు తీసుకునే నాథులు కానీ ఉండరు. కార్పొరేషన్‌లో ఇలాంటి లోపాయికారీ వ్యవహారాలకు, అక్రమార్జనలకు అంతే ఉండదని, కొంతమంది అధికారులకు ఈ బాగోతాలన్నీ తెలిసినా, నిమ్మకు నీరెత్తినట్లు ఉంటుంటారని విమర్శలు బోలెడు. ఈ నేపథ్యంలో, ఈ బినామీల వ్యవహారాలపై కొత్తగా వచ్చిన కమిషనర్‌కు ఫిర్యాదులందడంతో ఆయన ఆదేశాలతో అధికారులు దాడులకు రంగం సిద్ధం చేశారు. ఈనెల 28వ తేదీ రాత్రి ఆర్‌ఓలు, ఆర్‌ఐలు బృందాలుగా ఏర్పడి పలుప్రాంతాల్లో ఉన్న దుకాణాలను ఏకకాలంలో తనిఖీ చేశారు. నగరంలోని గాంధీబొమ్మ కూడలిలో ఉన్న జేవీఆర్ కాంపెక్స్, సుబేదార్‌పేట, బసోటా హోటల్ ఎదుట ఉన్న దుకాణాలు, పెద్దబజారులోని ఏసీ మునిసిపల్ కాంప్లెక్స్, డైకస్‌రోడ్డులోని కాంప్లెక్స్‌లో ఉన్న షాపులు అన్నిటినీ ఆకస్మికంగా తనిఖీ చేయడంతో అసలు బండారం బయటపడింది. బహిరంగ వేలంలో దుకాణాలు పొందిన వ్యక్తులు కాకుండా, బినామీపేర్లతో మరెవరో వాటిని నడుపుతున్నారని, నిర్ణీత అద్దెలకు కాకుండా, అంతకు మూడింతలకంటే ఎక్కువగానే బినామీలకు అద్దెలకు ఇచ్చి అక్రమార్జన చేస్తున్నట్లు గుర్తించారు. అలాంటి వాటిని సీజ్‌చేశారు కూడా. ఆయా దుకాణాల వారికి నోటీసులిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, కార్పొరేషన్ పేరుతో దుకాణాలను అడ్డగోలుగా బినామీలకు ఇవ్వడంపట్ల ఉన్నతాధికారులు ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. ఎప్పటినుంచీ ఇలాంటి అక్రమాలు జరుగుతున్నాయో నిగ్గుతేల్చాలని, అందులో ఎవరెవరి పాత్ర ఎంత ఉందో నిర్ధారించి చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు కూపీ లాగుతుండడంతో.. కార్పొరేషన్ వర్గాల్లో సైతం గగ్గోలుగా ఉంది.







Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com